తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## కోట క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదం

### పది మందికి స్వల్ప గాయాలు



గూడూరు, డిసెంబర్ 25, ప్రభాతవార్త
గూడూరు సమీపంలోని చిల్లకూరు వద్ద సోమవారం తెల్లవారు జామున కోట క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదం జరిగింది. పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న భీమడోలు గ్రామం నుండి అరుణాచలం వెళ్తున్న ఓ టెంపుల్ ట్రావెలర్ ముందు వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టింది. పది మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. నలుగురికి ఎక్కువ మోతాదులో దెబ్బలు తగిలాయి. తలలు ఒంటిమీద గాయాలు అందులో ఇద్దరికి కాళ్లు, చేతులు విరిగిపోయాయి. క్షతగాత్రులను గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## లోక రక్షకుడు యేసు క్రీస్తు

### ఘనంగా క్రిస్మస్ వేడుకలు



చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

గూడూరు, డిసెంబర్ 25, ప్రభాతవార్త
లోక రక్షకుడైన యేసు క్రీస్తు తన ప్రాణాలను శిలువపై త్యాగం చేసిన ప్రేమ స్వరూపిణి, తనకు హాని చేసిన వారి సైతం క్షమించి దగ్గరకు తీసిన దైవ దూత అని గూడూరులోని సార్వత్రిక క్రైస్తవ ప్రార్థన మందిరం పాస్టర్ డానియేల్ పులా రవికుమార్ పేర్కొన్నారు. క్రీస్తు జన్మదినం సందర్భంగా ఆదివారం క్రైస్తవ సోదరులు ఆదివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదే విధంగా సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చిలో పాస్టర్ ప్రశాంత్ కుమార్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. అంబేద్కర్ నగర్‌లోని హోసన్నా ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. చిన్నారులు ఆలపించిన క్రీస్తు గీతాలు అందరిని అలరించాయి. గూడూరు పట్టణంలోని చర్చిలు క్రైస్తవులతో కిటకిటలాడాయి.

## చిత్తూరు అభ్యర్థిత్వంపై ఇరు పార్టీల్లో టెన్షన్

### వైకాపా నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎపిఎస్ఆర్టిసి వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి పోటా పోటీ!
### - ప్రతిపక్షం నుండి తెలుగుదేశానికా లేక జనసేనకా!




చిత్తూరు, డిసెంబర్ 25 ప్రభాతవార్త:
అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి అధికార, ప్రతిపక్ష పార్టీల నుండి పోటీ చేసే అభ్యర్థులు ఎవరనే విషయంపై సర్వత్రా టెన్షన్ నెలకొంది. అధికార వైకాపా నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డిలు పోటీ పడుతున్నారు. మరోవైపు రాష్ట్ర స్థాయిలో తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య పొత్తు కుదరడంతో చిత్తూరు నుండి తెలుగుదేశం అభ్యర్థి పోటీ చేస్తారా! లేక జనసేన పార్టీ అభ్యర్థి పోటీ చేస్తారా! అనే విషయంపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అప్పటి తెలుగుదేశం అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్‌పై భారీ మెజార్టీతో గెలుపొందారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఏర్పాటు కావడం, ఆపై జరిగిన మున్సిపల్, మండల పరిషత్ ఎన్నికల్లో సైతం వైకాపా విజయం సాధించడంతో ఓ రెండు సంవత్సరాల పాటు చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పూర్తిగా తన గుప్పిట్లో పెట్టుకొన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో విభేదాలు వున్నప్పటికీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దిశా నిర్దేశంతో రెండేళ్ళ పాటు మిన్నకుండిపోయిన అసమ్మతి నాయకులు ఆపై చిత్తూరుపై పంజా విసరడం ప్రారంభించారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి తన సొంత నిధులను పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తూ ఈ సారి ఎలాగైనా వైకాపా అభ్యర్థిత్వం దక్కించుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఇప్పటికే పలు ప్రజాపయోగకర పనులు చేపట్టిన ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి ఇటీవల నియోజకవర్గ పరిధిలోని ప్రతి కుటుంబానికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకొని ఒక చీర, ఒక జాకెట్, ఒక షర్టు, ఒక ఫ్యాంటు వున్న కిట్లను పంపిణీ చేసి ప్రజల్లో మరింత చొచ్చుకుపోతున్నారు. ఇక ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ విషయానికి వస్తే గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్ పార్టీకి రాజీనామా చేసి వెళ్ళిపోవడంతో అప్పటి నుండి ఇప్పటి వరకు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీని సైతం తెలుగుదేశం అధిష్టానం నియమించుకోలేని పరిస్థితి నెలకొంది. గత నాలుగున్నర సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీకి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ లేకపోవడంతో చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని ముందుకు వెళ్ళని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల తెలుగుదేశం, జనసేన పొత్తు కుదరడంతో చిత్తూరు అభ్యర్థిత్వం జనసేనకు కేటాయిస్తారని ప్రచారం జరుగుతుంది. తెలుగుదేశం పార్టీ చిత్తూరును పొత్తులో భాగంగా జనసేనకు కేటాయిస్తుందా! లేక తెలుగుదేశం పార్టీ అభ్యర్థినే ఎన్నికల బరిలోకి నిలుపుతుందా! అనే దానిపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. చిత్తూరు నుండి తెలుగుదేశం తరపున పోటీ చేయడానికి మాజీ మేయర్ కఠారి హేమలత, జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షులు కాజూరు బాలాజీ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పులివర్తినాని తదితరులు పోటీ పడుతున్నారు. అలాగే జనసేన నుండి దివంగత మాజీ ఎంపీ ఆదికేశవులు కుమారుడు డిఎ శ్రీనివాసులు పోటీ చేయడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకొన్నట్లు తెలుస్తోంది. ఇటీవల చిత్తూరు వచ్చిన డిఎ శ్రీనివాసులు తాను ఈ సారి ఎన్నికల బరిలో వుంటానని అయితే ఏ పార్టీ నుండి అనేది ఇంకా ఖరారు కాలేదని స్పష్టం చేశారు. ఒకవేళ చిత్తూరు నుండి జనసేన పోటీ చేయకుంటే డిఎ శ్రీనివాసులు తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసే అవకాశాలు వున్నాయి.

## ప్రత్యేక ఆకర్షణగా క్రిస్మస్ ట్రీ



శ్రీకాళహస్తి, డిసెంబర్ 25 ప్రభాతవార్త
ప్రపంచ వ్యాప్తంగా జరిగే పండుగల్లో క్రిస్మస్ పండుగ ఎంతో ముఖ్యమైంది. పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి పట్టణం సర్వమత సమ్మేళనాలకు నిలయం. ఏపండుగ వచ్చినా సరే కులమతాలతో సంబందం లేకుండా చేసుకుంటారు. ఈనేపథ్యంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా స్థానిక కాసాగార్డెన్ సమీపంలో ఉన్న పురాతన లూథరన్ చర్చిలో ఫాస్టర్ రెవ.ఎం.మైకెల్‌బాబు ఆధ్వర్యంలో చర్చి అధ్యక్షుడు ఎ.మార్టిన్, ఉపాధ్యక్షుడు కె.రమేష్, కార్యదర్శి పికెజె.అబ్రహం, ట్రెజరర్ పి.జీవరత్నం, సభ్యులు క్రాంతికుమార్, సన్నిడియల్, ప్రవీణ్‌కుమార్, అభివృద్ధి కమిటీ కన్వీనర్ పి.జేసుదాసు, గాస్పెల్ కన్వీనర్ ఇఎం.లింకన్, మహిళా అధ్యక్షురాలు ఎంఎంఎం.కళావతిల ఆధ్వర్యంలో చర్చిని విద్యుత్ వెలుగుల్లో అద్భుతంగా అలంకరణ చేపట్టారు. ఎన్నడూ లేని విధంగా ఈఏడాది చర్చిలో క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలచింది. అనంతరం ఫాస్టర్ రెవ.మైకెల్‌బాబు ఆధ్వర్యంలో పిసిసి అధ్యక్షులు ఎ.మార్టిన్ క్రిస్మస్ ట్రీని వెలిగించి వేడుకలను ప్రారంభించారు. చర్చిలో ఉదయం 11గంటల నుంచి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం నిరుపేదలకు దుప్పట్లు, చీరలును అందించారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామంలోఉన్న చర్చిలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్‌చేసి చర్చిలోఉన్న చిన్నారులకు, క్రైస్తవసోదరులకు పంచిపెట్టారు. అనంతరం ఫాస్టర్ ఏలుమలై మాట్లాడుతూ ఏసు క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరి జీవితానికి ఆదర్శమని అందరు పాటించాలన్నారు. అనంతరం నిరుపేద మహిళలకుచీరలు పంపిణీచేశారు. మధర్‌థెరీస్సా స్వచ్ఛందసేవాసంస్థ అధ్యక్షురాలు మేరీచంద్రమ్మ, చర్చిసభ్యులు గోవిందయ్య, రమేష్, రామకృష్ణ, బత్తెయ్య, లూకా,పలువురు క్రైస్తవసోదరులు పాల్గొన్నారు.

బసవయ్యపాళెం చర్చిలో..
మండలంలోని బసవయ్యపాళెం గ్రామసమీపంలోని చెన్నై రోడ్డు సమీపంలో ఉన్న జెరూసలెం ప్రార్థన మందిరంలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చర్చిలో నిర్వహిస్తున్న ప్రార్థనల్లో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని క్రైస్తవ సోదరసోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని రౌతుసూరమాల గ్రామసమీపంలోని క్రైస్తవమిట్టలోని చర్చిలోను, కాసరం చర్చి, బోనుపల్లి, తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనలు చేపట్టారు.

## నేటి నుంచి క్రీడా సందడి ప్రారంభం

### - ఆడుదాం ఆంధ్ర పోటీల నిర్వహణకు సర్వం సిద్ధం
### - ఫిబ్రవరి 5వ తేదీ వరకు జిల్లా స్థాయి పోటీలు - కలెక్టర్

చిత్తూరు, డిసెంబర్ 25 ప్రభాతవార్త:
జిల్లాలో మంగళవారం నుండి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల సందడి ప్రారంభం కానుంది. జిల్లా అధికార యంత్రాంగం ఆడుదాం ఆంధ్ర పోటీల నిర్వహణ పక్కాగా చేపట్టి పూర్తి చేయడానికి సర్వం సిద్ధం చేసింది. జిల్లాలో మంగళవారం నుండి ప్రారంభం కానున్న ఈ క్రీడా సందడి ఫిబ్రవరి 5వ తేదీ వరకు జరుగనుంది. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల్లో దాగి వున్న నైపుణ్యంను వెలికి తీయడానికి, నేటి ఆధునిక జీవనంలో మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వం కోసం క్రీడలు దోహదపడుతాయని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. జిల్లాలో మంగళవారం నుండి 47 రోజుల పాటు జిల్లాలో 612 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్ర పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖో-ఖో పోటీలకు సంబంధించి జిల్లాలో మొత్తం 1,31,698 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనడానికి నమోదు చేసుకొన్నారన్నారు. క్రీడల నిర్వహణకు సంబంధించి అవసరమైన అన్ని రకాల కిట్లను క్షేత్ర స్థాయికి పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు సచివాలయ స్థాయిలో మంగళవారం నుండి జనవరి 9వ తేదీ వరకు జరుగుతాయన్నారు. అలాగే మండల స్థాయి పోటీలు జనవరి 10 నుండి 23 తేదీ వరకు జరుగుతాయన్నారు. నియోజకవర్గ స్థాయి పోటీలు జనవరి 24 నుండి 30వ తేదీ వరకు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయి పోటీలు జనవరి 31 నుండి ఫిబ్రవరి 5వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో మొత్తం 515 క్రీడల నిర్వహణకు మైదానలు గుర్తించడం జరిగిందని, క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించడానికి చర్యలు తీసుకొన్నామన్నారు. చిత్తూరు మెసానికల్ గ్రౌండ్‌లో మంగళవారం ఆడుదాం ఆంధ్ర క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సిఎం నారాయణస్వామి, జిల్లా మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కె రోజాలతో పాటు ఎంపీ రెడ్డప్ప, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో అందరు భాగస్వాములై విజయవంతం చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ పిలుపునిచ్చారు.

## రైతు కుటుంబంపై వైకాపా నేతల దాడి..

### డిజిపికి లేఖ రాసిన చంద్రబాబు



చికిత్స పొందుతున్న రామప్ప వర్గీయులు

కుప్పం/ గుడుపల్లె, డిసెంబర్ 25 ప్రభాతవార్త
గుడుపల్లె మండలం వెంకటాపురం గ్రామంలో భూతగాదాల నేపథ్యంలో రైతు కుటుంబంపై అధికార వైకాపా నేతలు దాడి చేసినట్లు బాధిత రైతు కుటుంబం గుడుపల్లె పోలీసులను ఆశ్రయించింది. బాధితులు, గ్రామస్తుల కథనం మేరకు.. వెంకటాపురం గ్రామంలో మోపురప్ప, రామప్ప, జడ్పీటిసి కృష్ణమూర్తి కుటుంబాల మధ్య పొలం దారి తగాదాలు ఉండేవి. ఈనేపథ్యంలో మోపురప్ప గతంలోనే కోర్టును ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో మోపురప్పతో జడ్పీటిసి కృష్ణమూర్తి వర్గీయులు దారి వివాదం పరిష్కస్తామని పేర్కొన్నట్లు తెలిసింది. ఆదివారం ఈ వ్యవహారంపై పంచాయతీ జరగ్గా తనపై జడ్పీటిసి కృష్ణమూర్తి దాడి చేసినట్లు రామప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రామప్ప భార్య, కుటుంబీకులు పలువురిపై మోపురప్ప వర్గీయులు దాడి చేశారని పేర్కొన్నాడు. దీంతో రామప్ప గాయాలపాలై కుప్పం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ వ్యవహారంపై పోలీసులను ఇరువర్గాలు ఆశ్రయించినట్లు తెలిసింది. కాగా వైకాపా నేతలు దాడి చేయడాన్ని ప్రతిపక్ష నేత చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని, తగు నష్టపరిహారం అందించాలని డిజిపికి రాసిన లేఖలో చంద్రబాబు కోరారు.

## అంచనాలకు మించి భక్తులు: స్పందన లేని అధికారులు

### శ్రీకాళహస్తీశ్వరాలయంలో తీరుమారని పాలన



రాహుకేతుమండపాలను పర్యవేక్షిస్తున్న చైర్మెన్

శ్రీకాళహస్తి,డిసెంబర్ 25 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారుల తీరు మారటం లేదు.వరుస సెలువుల, ప్రధానమైన రోజుల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని తెలిసినా అధికారుల్లో స్పందన లేదు. ఇక్కడి ఆలయానికి గత మూడేళ్ళుగా ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జి అధికారులను నియమిస్తున్నారు.దాంతో రద్దీ రోజుల్లో వారు రెండుపడవల మీద పయనం సాగిస్తూ ఇబ్బందులు పడుతున్నారు.శ్రీకాళహస్తీశ్వరాలయానికి వారంలో నాలుగు రోజులు విపరీతమైన రద్దీ ఉంటుంది. అలాంటి ఆలయానికి జిల్లాలోని తిరుపతిలో అందుబాటులో ఉండే అధికారికి బాధ్యతలు అప్పగించవచ్చు.కానీ పాలకుల మాయనో లేక దేవాదాయశాఖ నిర్లక్ష్యమో సుమారు 400 కిలో మీటర్ల దూరంలోని అధికారికి బాధ్యతలు అప్పగించారు. ఆయన రెగ్యూలర్‌గా పని చేసే ఆలయం కూడా రాష్ట్రంలో అతిపెద్దది.

**అంచనాలకు మించి జనం:**
శ్రీకాళహస్తీశ్వరాలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. ఆదివారం రాత్రి నుంచే పట్టణంలో ఎటు చూసినా భక్తుల సందడి చోటు చేసుకుంది. తిరుమలేశుని దర్శనానికి ఈ నెల 30 వరకు ఉత్తర ద్వారా దర్శనం అవకాశం కల్పించారు కాబట్టి అక్కడ దర్శనం చేసుకున్న వారు సమీపంలోని శ్రీకాళహస్తికి రావటం జరుగుతుంది. కానీ సోమవారం మూడు రోజుల వరుస సెలవుల జనం సునామిలా వచ్చారు.దాంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.అందుబాటులో ఉన్న సిబ్బంది తమ పరిధిలో చొరవ చూపి సేవలందించారు.కానీ అంచనాలకు మించి జనం రావటంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. దర్శనాలకు క్యూలైన్లలో గంటల కొద్ది నిరీక్షించాలంటే తిప్పలు పడ్డారు. ఇక్కడ అందుబాటులో ఉన్న అధికారులు, సిబ్బంది విఐపిల సేవలో తరించారు.సోమవారం వేకువ జాము నుంచి ఇసుకేస్తే రాలనంత రద్దీ ఏర్పడింది.ఆదివారం రాత్రికే పట్టణంలో లాడ్జిలన్ని ఫుల్ అయ్యాయి. వచ్చిన వారికి కునుకు తీయటానికి నీడ లేదు.తినటానికి తిండి లేదు. తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవటానికి స్థలం లేక నానా తిప్పలు పడ్డారు. అయితే ఉన్న సిబ్బంది లోపల పర్యవేక్షణకే సరిపోయారు.

**గంటల కొద్ది ట్రాఫిక్ సమస్య:**
శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులకు దేవస్థానం అధికారులు నాల్గవ గేటు నుంచి ప్రవేశం అలవాటు చేసారు.ఈ క్షేత్ర సంప్రదాయం ప్రకారం అప్రదిక్షణ క్షేత్రం.కాబట్టి బిక్షాల గాలిగోపురం నుంచి ప్రవేశించాలి.కానీ ఈ విధానాలకు అధికారులు చెల్లుచీటి పాడారు.పాలకులు పట్టించుకోవటం లేదు.దాంతో వచ్చిన వాహనాలు సన్నిధివీధి నుంచి వెళ్ళాల్సి వస్తుంది. ఇది ఇరుకు రోడ్డు కాబట్టి గంటల కొద్ది ట్రాఫిక్ స్థంభించి పోయి ఇక్కట్లు ఎదుర్కొన్నారు. అయితే ఉదయం నుంచి చైర్మెన్ మాత్రం రాహుకేతు మండపాలను పరిశీలించుకుంటూ కంచుగడప వద్ద బైఠాయించి పర్యవేక్షించారు.ఒక దశలో స్వచ్ఛంద వాలంటీర్‌లా సిఐ అంజూ యాదవ్ తమ సేవలందించారు. ఇక ఆలయ ఎఇఓ ధనపాల్,సూపరింటెండెంట్ నాగభూషణం, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడు,ఇంజనీరింగ్‌విభాగానికి చెందిన ప్రతాప్,ఆలయ సిబ్బంది,ఎస్‌పిఎఫ్ సిబ్బంది, హోంగార్డులు జవాబుదారి తనంతో పని చేసారు.

## రామాపురం రోడ్డుకు మహర్దశ

### రూ.కోట్ల 8కోట్ల రుపాయాలతో బి.టి రోడ్డుకు భూమి పూజ
### తుడ రూ.4కోట్లు, ఆర్ అండ్ బి రూ.4కోట్లు భాగస్వామ్యం
### రామాపురం రోడ్డు ఏర్పాటుకు భూమి పూజ చేసిన తుడ చైర్మెన్ మోహిత్‌రెడ్డి



తిరుపతిరూరల్, డిసెంబర్25 ప్రభాతవార్త:
తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం నుండి రామచంద్రాపురం మండలం గంగిరెడ్డిపల్లి ప్రధాన రహదారి నిర్మాణానికి సోమవారం తుడ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి భూమిపూజ చేసారు. తిరుపతి 150 బైపాస్ రోడ్డు నుండి రామచంద్రాపురం వరకు దాదాపు 7కిలో మీటర్ల వరకు ట్రాఫిక్‌తో ప్రజలు సతమతమౌతున్న విషయం తెల్సిందే. ప్రజా ఇబ్బందులను గుర్తించి, తుడ చైర్మెన్ మోహిత్ రెడ్డి స్పందించి డబుల్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తుడ నిధులు రూ.4కోట్లు, ఆర్ అండ్ బి రూ.4కోట్ల రుపాయాలతో ప్రధాన రహదారి మార్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మోహిత్‌రెడ్డి తెలిపారు. ప్రధాన రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ శుభగిరికి సూచించారు. చిగురువాడ గ్రామ పంచాయతీ పరిధిలో వరదకు కొట్టుకుపోయిన బ్రిడ్జిని పున:నిర్మించాలని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు విడుదల మాధవరెడ్డి, మూలం చంద్రమోహన్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, భానుకుమార్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నగరిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



ఆకర్షణగా నిలిచిన బాల ఏసు పాక, క్రిస్మస్ ట్రీలు

## ఆడుదాం ఆంధ్రా ఏర్పాట్లు సిద్ధం చేపట్టండి

### కమిషనర్ హరిత



8లో

## కేంద్రపథకాలను లబ్దిదారులకు అందించడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర

### -రాష్ట్ర కార్యదర్శి కోలా




.శ్రీకాళహస్తిరూరల్/తొట్టంబేడు, డిసెంబర్ 25 ప్రభాతవార్త
గ్రామ స్వరాజ్యం నిర్మాణమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర అని అర్హులైన ప్రజలను లబ్దిదారులుగా మార్చడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఉద్దేశ్యం అని రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ అన్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు సోమవారం శ్రీకాళహస్తి తొట్టంబేడు మండలాల్లో కమ్మకొత్తూరు, అక్కుర్తి పంచాయతీలు, ఏర్పేడు మండలంలోని కృష్ణంపల్లి, జంగాలపల్లి, తొట్టంబేడు మండలంలోని రామచంద్రాపురం, సాంబయ్యపాళెం పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలను సంబందిత శాఖల అధికారులు మరియు లబ్దిదారులతో కలిసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అసెంబ్లీ పార్టీ కో కన్వీనర్ మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, కార్యక్రమ కన్వీనర్లు సెంజిగరం వెంకటరమణయ్య, రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి చాగణం శైలజ, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, మండలాల అధ్యక్షులు కూనాటి నాగరాజు, వేడాం కృష్ణయ్య, ధర్మారెడ్డి, బొబ్బిలిరెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఈగలబాలాజీ, సుబ్బరామిరెడ్డి, ఆర్కాడువంశీ, రాజశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యం, మునిరాజ, చొక్కానిరమేష్, కె.వాసు, నాగరాజు, ధర్మయ్యయాదవ్, రామిరెడ్డి, సుందరరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## టోకెన్,టిక్కెట్ ఉన్న భక్తులకే ఆలయంలోకి అనుమతి

### తిరుమల విఎస్‌ఓ నందకిశోర్



తిరుమల,డిసెంబర్ 25 ప్రభాతవార్తప్రతినిధి:
పదిరోజుల వైకుంఠద్వార దర్శనంలో భాగంగా సోమవారం ఉదయం నుండి తిరుమలకు పెద్దసంఖ్యలో భక్తులు చేరుకుంటున్నారు. వీరిలో దర్శన టిక్కెట్లు, టోకెన్లు కలిగిన భక్తులను మాత్రమే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌ద్వారా ఆలయంలోపలకు అనుమతించి, సంతృప్తికరంగా వైకుంఠద్వార దర్శనం చేయిస్తున్నారు. ముఖ్యంగా సర్వదర్శన టైమ్ స్లాట్‌తో ఆయా రోజు దర్శనాలకు సంబంధించి వస్తున్న భక్తులను టోకెన్లు పరిశీలించి సాఫీగా క్యూలైన్లద్వారా అనుమతినించేలా విజిలెన్స్‌సిబ్బంది,శ్రీవారి సేవకులు సమన్వయంతో సేవలందిస్తున్నారని తిరుమల విఎస్‌ఓ నందకిశోర్ తెలిపారు. వైకుంఠం-1 క్యూ కాంప్లెక్స్ సమీపంలో ఈ ప్రత్యేక టోకెన్లు కలిగిన భక్తులను లైన్లోనికి అనుమతినిస్తున్న విధానాన్ని సోమవారం ఏవిఎస్‌ఓ సాయిగిరిధర్‌తో కలసి విఎస్‌ఓ నందకిశోర్ తనిఖీ చేశారు. సామాన్యభక్తులకు ఇబ్బంది లేకుండా, అసౌకర్యం కలగకుండా టిటిడి సకల సౌకర్యాలు కల్పించిందన్నారు. టోకెన్లు లేని భక్తులు కూడా తిరుమలకు వస్తున్నా, వారందరూ ఆలయం ముందు గొల్లమండపం, అఖిలాండం వద్ద ప్రాజలంచే స్వ౦కా౦ని ,కొబ్బరికాయకొట్టి మొక్కులు చెల్లించుకుంటున్నారన్నారు. వీరి భద్రతపై కూడా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని విఎస్‌ఓ తెలిపారు. ఎంతో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాల్లో భాగంగా మూడవరోజు సోమవారం తిరుమలకు భక్తులు భారీగా చేరుకున్నా టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈఓ ఏవి ధర్మారెడ్డి, సివిఎస్‌ఓ నరసింహకిశోర్ ఆదేశంఆదేశాలు, సూచనలతో తగిన రీతిలో భక్తులకు అవసరమైన సమాచారం తెలియజేస్తున్నామన్నారు. భక్తులు కూడా సంయమనంతో వారికి కేటాయించిన రోజు,ఆ సమయంలో తిరుమలకు చేరుకోని వైకుంఠద్వార దర్శనం చేసుకోవచ్చన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పేయి జన్మదిన వేడుకలు



చిత్తూరు, డిసెంబర్ 25 ప్రభాతవార్త: చిత్తూరు సంతపేటలో సోమవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 99వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంతపేటలో బిజెపి నాయకులు బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సీనియర్ బిజెపి నాయకులు చిట్టిబాబు హాజరై కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా సీనియర్ బిజెపి నాయకులు చిట్టిబాబు నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఎం.సుహాసిని, చల్లారి అమరనాథ్, పండరినాథ్, శేఖర్, కుప్పన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ సంబరాలు

పాలసముద్రం, డిసెంబర్ 25 ప్రభాతవార్త: పాలసముద్రం మండలంలో సోమవారం క్రిస్మస్ పండుగ పురస్కరించుకొని సంబరాలను వైభవంగా నిర్వహించుకొన్నారు. మండల కేంద్రం పాలసముద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లోని చర్చిలను సుందరంగా అలంకరించారు. సోమవారం ఉదయం 9 గంటల నుండి క్రిస్మస్ పురస్కరించుకొని చర్చిల్లో పాస్టర్లు, ఫాదర్లు, క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకొన్నారు. తెలుగుదేశం రాష్ట్ర ప్రభావశీలుర గుర్తింపు కమిటీ సభ్యులు భీమినేని చిట్టిబాబు క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులకు కేకులు పంపిణీ చేసి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు



బంగారుపాళ్యం, డిసెంబర్ 25 ప్రభాతవార్త: ఏసు ప్రభువు జన్మదినంను పుస్కరించుకొని క్రిస్మస్ వేడుకలను సోమవారం మండలంలోని క్రైస్తవులు క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించుకొన్నారు. అన్ని చర్చిలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆదివారం రాత్రి నుండి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. బంగారుపాళ్యం, ముంగరమడుగు, కరిడివారిపల్లి, తుంబకుప్పం, కొదలమడుగు, రాగిమానుపెంట, నల్లంగాడు, ఎర్రాండ్లపల్లి తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బంగారుపాళ్యం సిఎస్ఐ చర్చి నందు రోప్ సంస్థ డైరెక్టర్ ధనశేఖర్ 300 మంది పేదలకు బట్టలు, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎంబి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే నలగాంపల్లి లూప్ చర్చి నందు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ మురళీమోహన్ క్రైస్తవులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాజీ ఎమ్మెల్యే లలితకుమారి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముంగరమడుగులోని సిఎస్ఐ చర్చిలో 200 మందికి వస్త్రదానం చేపట్టారు. తగ్గువారిపల్లిలోని కార్నర్ స్టోన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాస్టర్లు కిరణ్, యోహాన్, గోవిందయ్య, రాజశేఖర్, శ్యాముల్, జాన్, ఎధిక్‌సన్ పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

## ఘనంగా వాజ్‌పేయి జన్మదిన వేడుకలు

చిత్తూరురూరల్, డిసెంబరు 25 ప్రభాతవార్త:



చిత్తూరు పట్టణం, గాంధీ సర్కిల్ వద్ద సోమవారం మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి జన్మదినోత్సవాన్ని భాజపా నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు చేతుల మీదుగా సెంట్రల్ మండల అధ్యక్షుడు షణ్ముగం ప్రతి ఒక్కరికి గులాబీ, మల్లె పూల మొక్కలను అందరికీ అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ దేశ ప్రజల సంక్షేమం కోసం కృషి చేసిన వాజ్‌పేయి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని, దేశాభివృద్ధి కోసం ఆయన తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్‌పి వెంకటేశ్వర చౌదరి, జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరిశ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కవికుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బాబు, గిరింపేట మండల అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు దుప్పట్లు అన్నదానం



చౌడేపల్లి, డిసెంబర్ 25 ప్రభాతవార్త పేదలకు దాత దుప్పట్లు, అన్నదానం చేసారు. క్రిస్మస్‌ను పురష్కరించుకొని చిట్రెడ్డిపల్లికి చెందిన వెంకట్రమణ, శాంతమ్మ దంపతులు స్థానిక ఆరోగ్య కేంద్రంలో పేదలకు దుస్తులం దించడంతో పాటు 200మందికి అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. గత 15యేళ్ళుగా దంపతులిద్దరూ యేటా క్రిస్మస్ సందర్భంగా పేదలకు సాయమందిస్తున్నారు. హెచ్‌డిఎస్ ఛేర్మన్ కె.కళ్యాణ్‌భరత్ వారిద్దరినీ అభినందించారు. ఆసుపత్రి సిబ్బంది, యానాదికాలనీ వాసులతోపాటు స్థానికులు పాల్గొన్నారు.

**క్రిస్మస్ వేడుకలు :** జీసస్ జన్మదినం(క్రిస్మస్) వేడుకలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయా చర్చిల వద్ద వివిధ వేషధారణలతో చూపరులను అలరించారు.

## మాజీ ప్రధాని వాజ్‌పేయి జన్మదినోత్సవం



పాలసముద్రం, డిసెంబర్ 25 ప్రభాతవార్త: మాజీ ప్రధాని అటల్ బీహారీ వాజ్‌పేయి జన్మదినంను బిజెపి నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. పాలసముద్రం హరిజనవాడలో మాజీ ప్రధాని అటల్ బీహారీ వాజ్‌పేయి చిత్రపటానికి బిజెపి నాయకులు మురగదాస్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు డి.రాజేష్‌కుమార్, చిన్నస్వామి, శ్రీనివాసన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదలకు అన్నదానం చేసిన బుల్లెట్ సురేష్



చిత్తూరురూరల్, డిసెంబరు 25 ప్రభాతవార్త: చిత్తూరు పట్టణం, న్యూ కయని కట్టు వీధిలోని రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మెన్ బుల్లెట్ సురేష్ కార్యాలయం నందు తన తండ్రి బుల్లెట్ శ్రీనివాసన్ 24వ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం పేదలకు అన్నదానం చేసారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బుల్లెట్ శ్రీనివాసన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి తన తండ్రి అడుగుజాడల్లో బుల్లెట్ సురేష్ సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయమన్నారు. అనంతరం బుల్లెట్ సురేష్ మాట్లాడుతూ తన తండ్రి బుల్లెట్ శ్రీనివాసన్ జ్ఞాపకాలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను, సేవాకార్యక్రమాలను తప్పకుండా నెరవేర్చుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చుడా ఛైర్మెన్ పురుషోత్తం, టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ రామ్‌గణేష్, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ భాస్కర్, బుల్లెట్ సురేష్ తనయుడు, యువనాయకుడు అప్పు, కార్పొరేటర్లు మురళీ,నవీన్, కుట్టిరాయల్, లక్ష్మణన్, జ్ఞాన జగదీష్, ఎకె రవి, దాడి మున్నా, అల్తాఫ్ మొదలియార్ సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాజ్‌పేయి జన్మదినం

గుడిపాల, డిసెంబర్ 25 ప్రభాతవార్త: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జన్మదిన వేడుకలను సోమవారం మండల కేంద్రం గుడిపాలలో బిజెపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బిజెపి మాజీ ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు మాజీ ప్రధాని వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాజ్‌పేయి పరిపాలన దక్షతతో పార్టీలకు అతీతంగా దేశాభివృద్ధికి బాటలు వేశారన్నారు. దేశాభివృద్ధి లక్ష్యంగా సుపరిపాలన అందించిన ఘనత మాజీ ప్రధాని వాజ్‌పేయికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సోమనాథ్‌గౌడ్, ఏలుమలై, కుమార్‌బాబు, శేఖర్, శరవణ, సుధీర్‌కుమార్, ఇతర బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

తవణంపల్లె, డిసెంబర్ 25 ప్రభాతవార్త: ఏసుక్రీస్తు జన్మదినం క్రిస్మస్ పండుగ పర్వదినాన్ని సోమవారం మండలంలోని క్రైస్తవులు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈమేరకు అరగొండ కొత్తబస్టాండు సమీపంలోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో పాస్టర్ గాబ్రియేల్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించి ఏసు ప్రభోదాలను వివరించారు. అనంతరం పేదలకు బట్టలను పంపిణీ చేశారు. అలాగే మండలంలోని అరగొండ, ఎగువమత్యం, దిగువమత్యం, తడకర, తవణంపల్లె, ఐరాల క్రాస్, కొండ్రాజుకాల్వ, స్వస్తికనగర్, వీర్లగుడిపల్లె, పట్రపల్లె, ఈచనేరి తదితర గ్రామాల్లోని సీఎస్ఐ, రోమన్ క్యాథలిక్ చర్చిలలో క్రైస్తవ సోదరులు క్రిస్మస్ వేడుకల కోసం రంగులు వేసి విద్యుద్దీపాలలో సర్వాంగ సుందరంగా ముస్తాబైన చర్చిలలో శనివారం రాత్రి నుండే క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. దీనితో చర్చిలలో ప్రత్యేకప్రార్థనలు, దీపారాధనలు చేయడంతో పాటు ఏసుక్రీస్తు మహిమలను పాస్టర్లు భక్తులకు వివరించారు.

## పెద్దపంజాణిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



పెద్దపంజాణి డిసెంబర్ 25 ప్రభాతవార్త : మండలంలోని క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పండుగను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలను రంగురంగుల విద్యుత్‌దీపాలు,పుష్పాలతో అలంకరించారు. ఉదయం నుంచే చర్చిల్లో మతపెద్దలు ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా క్రీస్తు జననం,క్రైస్తవమత ప్రాముఖ్యతను మతపెద్దలు వివరించారు.ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు జరిపారు. రాజుపల్లి చర్చిలో తమ్మిరెడ్డి,భానుప్రతాప్ రెడ్డిలతో పాటు పలువురు పాల్గొని కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.పొట్టగానిపల్లి చర్చిలో ఎంపిపి రెడ్డెప్ప,వైకాపా మండల కన్వీనర్ బాగారెడ్డి,సంఘం పెద్దలు ప్రభాకర్,సుబ్రమణ్యం,నారాయణ,ఆశమ్మ,రత్నమ్మ,రవి,మహేష్‌ల ఆధ్వర్యంలో పేదలకు వస్త్ర,నిత్యవసర సరుకులు పంపిణీ చేసారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఘనంగా హిందూ ధార్మిక సమ్మేళనం



కుప్పం, డిసెంబర్ 25 ప్రభాతవార్త స్థానిక శ్రీ సోమేశ్వరాలయంలో సమరసత సేవా ఫౌండేషన్ అధ్వర్యంలో సోమవారం హిందూ ధార్మిక సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిథిగా బంగారుపాళ్యం బ్రహ్మానంద ఆశ్రమం శ్రీశ్రీ కేశవానంద స్వామిజీ హాజరై హిందూ ధర్మ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమాల్లో ఎస్ఎస్ఎఫ్ జిల్లా సహ కన్వీనర్ శ్రీరాములురెడ్డి, జిల్లా ధర్మ ప్రచారక్ నారాయణస్వామి, కుప్పం డివిజన్ కన్వీనర్ శ్రీరాములురెడ్డి, కో కన్వీనర్ భూపతి, మండల కన్వీనర్ బీరప్ప, కేంద్ర కన్వీనర్ విసి మంజునాథ్, నీలక ఒంఠం, యుగంధర్, గీతమ్మ, కళావతి, భజన బృందాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పేయి జన్మదిన వేడుకలు



కుప్పంరూరల్, డిసెంబర్ 25 ప్రభాతవార్త భారతీయ జనతా పార్టీ నేతలచే కుప్పం ఆర్టీసీ బస్టాండు, పైపాళ్యం, రామకుప్పంలలో మాజీ ప్రధాని దివంగత వాజ్‌పేయి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకావిష్కరణ, కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమాల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి తులసినాథ్, అసెంబ్లీ కన్వీనర్ శివశంకర్, బిజెపి నేతలు రాజసింహ, ఆంజనేయులు, వడివేలు, బేట్రాయన్, అశోక్, మునిరత్నం, ముత్తుకుమార్, మణి, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు .. ప్రత్యేక ప్రార్థనలు

కుప్పంరూరల్, డిసెంబర్ 25 ప్రభాతవార్త క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పండగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే కుప్పం పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చర్చిలలో ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈసందర్భంగా క్రీస్తు జననం, బైబిల్‌లోని ముఖ్యాంశాలను ఫాదర్లు క్రైస్తవ సోదరులకు వివరించారు. పండగ సందర్భంగా చర్చిలన్నీ రంగురంగుల విద్యుద్దీపాలతో అలరించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాజీవ్ నగర్ చర్చిలో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం తదితరులు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఫాస్టర్ పీటర్, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి



శాంతిపురం, డిసెంబర్ 25 ప్రభాతవార్త మాజీ సిఎం చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ పోస్టర్లను స్థానిక టిడిపి కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్, మహాశక్తి పథకాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. వైకాపా ప్రభుత్వానికి ఎన్నికల్లో ప్రజలే గట్టిగా బుద్ధిచెబుతారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, రమేష్, నాగరాజు, గోవిందరాజులు పాల్గొన్నారు.

## ఐరాలలో వైభవంగా క్రిస్మస్ వేడుకలు

ఐరాల, డిసెంబర్ 25 ప్రభాతవార్త: మండలంలో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ సోదరులు సోమవారం అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈమేరకు మండలంలోని చిగరపల్లె, చినకాంపల్లె, ఐరాల, పాతపాళ్యం తదితర గ్రామాల్లోని సీఎస్ఐ, రోమన్ క్యాథలిక్ చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇదిలా వుండగా మండల టీడీపీ నాయకులు మోతుకూరి సోమశేఖర్‌నాయుడు క్రిస్మస్ పండుగ సందర్భంగా తిరువణంపల్లె గ్రామంలోని చర్చికి ఐదు వేల రూపాయలను, తల్లి, తండ్రి లేని 10 మంది పిల్లలకు రెండు వేల రూపాయలను స్థానిక మాజీ ఎంపీటీసీ నటరాజ్, మాజీ సర్పంచ్ మురుగేష్‌ల ద్వారా అందజేశారు.

## నిస్వార్థంగా నిత్యం పేదలకు అమ్మఅన్నదానం

పుంగనూరు,డిసెంబరు 25 ప్రభాతవార్త : ఏఫలాపేక్షా లేకుండా నిత్యంపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ఐదువారాలుగా అందచేస్తున్న అమ్మఅన్నదాన టీంను పలువురు అభినందిస్తున్నారు. పట్టణానికి చెందిన కొందరు యువకులు ఒకటీంగా ఏర్పడి పేదలు,ఆర్తులకు అన్నదానం చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎవరూ ఆకలితో అలమటించకూడదనే సిద్దాంతం తోనే ఈకార్యక్రమం ప్రారంభించామని వారు తెలిపారు. ఇందుకు దాతలు చేయూతనందిస్తున్నారన్నారు. సోమవారం అన్నదానం కార్యక్రమానికి దుబాయ్‌లో ఉన్న దేవేంద్ర కుటుంబం వితరణ అందచేసిందన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు



బాలాయపల్లి, డిసెంబర్ 25, ప్రభాతవార్త మండలంలో ప్రభువైన యేసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. బాలాయపల్లి లూథరన్ చర్చిలో పాస్టర్ థామస్ బైబిల్ సందేశాన్ని, ప్రభువు గొప్పదనాన్ని చదివి వినిపించారు. అధిక సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారు. జయంపు, గొట్టికాడు, అంబలపూడి, నిండలి, బాలాయపల్లి, మేల్చూరు ఇంక పలు చర్చిలలో క్రిస్మస్ ప్రార్థనలు మిన్నంటాయి. చర్చిలను, విద్యుత్ దీపాలు, స్టార్‌లు, క్రిస్మస్ ట్రీలు, శాంతా క్లాస్‌లతో అలంకరించారు. పలు చర్చిలలో క్రిస్మస్ ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు.

## వెంకటగిరిలో క్రిస్మస్ వేడుకలు



వెంకటగిరి, డిసెంబర్ 25, ప్రభాతవార్త పట్టణంలోని కాసిపేట వద్ద ఉన్న ఆంధ్ర లూథరన్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. చర్చిలో పాస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అందరూ ఏసుక్రీస్తు మార్గంలో పయనించాలని పాస్టర్ సూచించారు. అందరూ శాంతియుతంగా ఉండాలని ఏసుక్రీస్తు బోధించినట్లు తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్టియన్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యానగర్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



కోట,డిసెంబర్ 25 ప్రభాతవార్త కోట మండలంలోని విద్యానగర్ హోలీ ప్రేయర్ చర్చిలోను చంద్రశేఖపురం, చిట్టేడు, మద్దాలి, కేశవరం, కోట, రంగన్నగుంట,కొత్తపాళెం, తదితర గ్రామాల్లో క్రిస్మస్ పండగను ఘనంగా జరుపుకున్నారు. విద్యానగర్‌లోని హోలీ ప్రేయర్ చర్చిలో లోక రక్షకుడు ఏసుకు స్వాగతం పలుకుతూ విశ్వాసులు ఆది వారం రాత్రి నుంచి వేడకలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హోలీ ప్రేయర్ చర్చిలో రెవెరెండ్, డాక్టర్, ఎం.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఏసు ప్రభువు జీవనం అందరికి ఆదర్శప్రాయమన్నారు. తన భోధనల ద్వారా మానవాళి సన్మార్గం వైపు నడిపించేలా మార్గ నిర్దేశం చేశారు. అనంతరం పేద ప్రజలకు స్వీట్లు , దుపట్లు, వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్,మేరీ సుజాత, పాస్టర్ సర్వాప్ డిస్నీ,సంఘ సభ్యులు, ప్రమఖులు, తదితరులు పాల్గొన్నారు.

..

## తడలో పలుచోట్ల క్రిస్మస్ వేడుకలు



తడ, డిసెంబర్ 25 ప్రభాతవార్త తడ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం క్రైస్తవ సోదరులు క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. తడ, తడకండ్రిగలలోని పలు చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచి క్రైస్తవ సోదరులు ప్రార్థనలు చేశారు. పలువురు హిందువులచే శుభాకాంక్షలు అందుకున్నారు. తడకండ్రిగ పంచాయతీ మాజీ ఉపసర్పంచ్ తడ రాజకుమార్ సోమవారం పంచాయతీ పరిధిలో అనాథలు ఉన్న చోటికి వెళ్లి వారికి చలికాలంలో దుప్పట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా భోజనం ప్యాకెట్లు కూడా అందించారు. ప్రతి ఏడాది క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకునే రాజకుమార్ కుటుంబం ఇటీవల మృతిచెందిన తన కుమార్తె పేరు మీదుగా ఈ సాయం అందించారు. తడకండ్రిగ బజారు సెంటర్, రైల్వేస్టేషన్‌రోడ్డు, మదిన కాలనీ, ఎస్సీ కాలనీలలో ఆయనతో పాటు జెడి రాజు, నాగరాజరెడ్డి, రాజశేఖర్ తదితరులు ఈ సాయం అందజేయడంలో సహకరించారు.

## దీక్ష శిబిరంలో క్రిస్మస్ వేడుకలు



గూడూరు, డిసెంబర్ 25, ప్రభాతవార్త అంగన్‌వాడీలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సమ్మె సోమవారానికి 14వ రోజుకు చేరుకుంది. రిలే నిరాహార దీక్షల్లో ఉన్న అంగన్‌వాడి కార్యకర్తలు అందరూ క్రిస్మస్ వేడుకలు శిబిరంలోనే చేసుకున్నారు. అనంతరం ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలు రెండు వారాల నుండి తమ కుటుంబాల బాధ్యతలను పక్కనపెట్టి పస్తులతో దీక్షలు చేస్తుంటే ప్రభుత్వం నుండి కనీస స్పందన లేకపోవడం చాలా బాధాకరమని వారు అన్నారు. దీక్ష శిబిరం వద్దకు ఏపిటిఎఫ్ స్టేట్ కౌన్సిల్ వై. సుబ్రమణ్యం రాజు తమ పూర్తి మద్దతు తెలియజేయడం జరిగింది. అంగన్‌వాడీల న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ అధ్యక్షురాలు ఏ. ఇంద్రావతి, రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, సిఐటియు పట్టణ అధ్యక్షులు బివిరమణయ్య, కార్యదర్శి ఎస్. సురేష్, బి. చంద్రయ్య, ఏ. ప్రసాద్, సెక్టార్ లీడర్లు లక్ష్మి, ముని, పెంచలమ్మ, మంగమ్మ, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వంలో అవినీతి తప్ప అభివృద్ధి లేదు

### మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, డిసెంబర్ 25, ప్రభాతవార్త వైసిపి ప్రభుత్వంలో అవినీతి తప్ప అభివృద్ధి లేదని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణం 17వ వార్డు చాకలి వీధి తూర్పు వీధులలో భవిష్యత్తు గ్యారంటీ బాబు షూరిటీ కార్యక్రమాన్ని ఆలయన నిర్వహించారు. ఎమ్మెల్యేలను మార్చి మరల అధికారంలోకి సిఎం జగన్మోహన్ రెడ్డి రావాలని ప్రయత్నాలు చేస్తున్నారని ప్రజలు ఆయనే మార్చాలని అనుకుంటున్నట్లు తెలిపారు. వెంకటగిరి పట్టణంలో తాను చేసిన అభివృద్ధి తప్ప నాలుగున్నర సంవత్సరంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఇంటింటికి వెళ్లి ఆయన కరపత్రాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాదర్, మాజీ కౌన్సిలర్ విశ్వనాథం, నాయకులు నర్సింహులు, చెంగారావు, బాబు, మంకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎడిపిఎస్ వార్షికోత్సవ వేడుకలు

సూళ్లూరుపేట, డిసెంబర్ 25 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలో అంబేడ్కర్ ధర్మపోరాట సమితి ఆవిర్భవించి 28 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం సంస్థ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎర్రబోతు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 1995వ సంవత్సరంలో నెల్లూరు కేంద్రంగా ఆవిర్భవించిన ఎడిపిఎస్ దళిత బహుజనుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల్లో చొచ్చుకుపోయిందని తెలిపారు. ఇంగిలాల రామచంద్రరావు ఈ సంస్థ స్థాపనకు ముందుండి నడిపించారని సుబ్రహ్మణ్యం చెప్పారు. సంస్థ 28వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన శుభసందర్భంలో ప్రజా సమస్యలపై పోరాడేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిపిఎస్ నాయకులు కృష్ణయ్య, మాధవయ్య, రమణయ్య, చెంచయ్య, నడిపయ్య, సుధాకర్, వెంకటేశ్వర్లు, రవి, శీను, మునిరామయ్య, ధనుంజయ, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓజిలిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ఓజిలి, డిసెంబర్ 25 ప్రభాతవార్త ఓజిలి మండలంలో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మండలంలోని చరినచలను విద్యుద్దీపాలతో అలంకరించి వేడుకలు నిర్వహించారు. మండలంలోని ఓజిలి, కురుగొండ, మానమాల, ఆరిమేనుపాడు, తదితర అన్ని గ్రామాల్లోని చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం నుంచి చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు కేసులు కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏసుక్రీస్తు జననం, బైబిల్‌లోని సందేశాలను వినిపించారు.

## విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించండి

### విఆర్‌ఏల జిల్లా కార్యదర్శి కె.సుబ్బయ్య

గూడూరు, డిసెంబర్ 25 ప్రభాతవార్త ఈ నెల 28వ తేదీన విఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షను జయప్రదానం చేయాలని విఆర్‌ఏల జిల్లా కార్యదర్శి కె.సుబ్బయ్య కోరారు. గూడూరులోని గ్రామ ఉద్యోగుల భవనంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఆర్‌ఏల దీర్ఘకాలికంగా ఉన్న పలు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఏల గౌరవాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, జిల్లా అధ్యక్షులు గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పాయ్ జయంతి



గూడూరు, డిసెంబర్ 25 ప్రభాతవార్త గూడూరు పట్టణ బిజెపి కారాలయంలో గూడూరు అర్బన్ మండల అధ్యక్షులు బాలకృష్ణ నాయుడు ఆధ్వ ర్యంలో మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పాయ్ 99వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వాజ్‌పాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వాజ్‌పాయ్ జయంతిని పురస్కరించుకొని నరసింగరావుపేటలో ఉన్న బాలసదనంలో విద్యార్థినులకు స్వీట్లు, బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ కోకన్వీనర్ కుంటా నరేంద్ర, ప్రధాన కారనయదర్శులు గుంజి శ్రీనివాసరావు, కె.సాయిలక్ష్మణ్, టౌన్ ఉపాధ్యక్షులు జీవీ నాయుడు, ఎం.సురేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు డాక్టర్ మరిదాసు, టౌన్ మైనారిటీ అధ్యక్షులు ఎస్‌కె మీరా సాహెబ్, టౌన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుబు వైవీ సుబ్బయ్య, టౌన్ కార్యదర్శులు నీలి ధనుంజయ, గుంజి ప్రేమసుందర్, చిట్టి, జానకిరామ్‌పేట యూత్ అధ్యక్షులు వాసునాయుడు, షేక్ అక్బర్, అల్లాబక్షు, శ్రీను పాల్గొన్నారు.

## వాజ్‌పాయ్ అందరికీ ఆదర్శం



కోట, డిసెంబర్ 25 ప్రభాతవార్త దివంగత మాజీ ప్రధాని అటల్‌బిహారి వాజ్‌పాయ్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని జిల్లా బిజెపి ఇన్‌ఛార్జ్ బైరప్ప అన్నారు. వాజ్‌పాయ్ జయంతిని పురస్కరించుకొని సోమవారం కోటలోని బిజెపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కోట మండల బిజెపి అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి విశ్వనాథం వాసు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మస్తానమ్మ, తిరుపాలయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## దొరవారిసత్రంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

దొరవారిసత్రం, డిసెంబర్ 25 ప్రభాతవార్త మండల పరిధిలోని దొరవారిసత్రం, ముచ్చలగుంట, ఏకొల్లు, నెల్లూరుపల్లి, నెలబల్లి, గొల్లపాలెం, అక్కరపాక, కల్లూరు, కల్లూరుకండ్రిగ, తొగరాముడి తదితర గ్రామాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉన్న చర్చిలలో ఏసుక్రీస్తుకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అర్ధరాత్రి గ్రామాల్లో ఏసు క్రీస్తు కీర్తనలు ఆలపించారు. అందరూ కులమతాలకు అతీతంగా చర్చిల వద్ద భోజనాలు ఏర్పాటు చేశారు.

## వాకాడులో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

వాకాడు, డిసెంబర్ 25, ప్రభాతవార్త మండల కేంద్రమైన వాకాడులో సోమవారం గోత్రం చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రార్థన మందిరంలో పాస్టర్ ప్రశాంత్ బాబు ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ప్రార్థన మందిరంలో క్రిస్మస్ సంబరాలు ప్రత్యేకంగా జరుపుకున్నారు. ప్రార్థన మందిరం యూత్ అనేక సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

# తిరుపతి డివిజన్

## సూర్యనారాయణ హోమంను ఇంటి పండుగలా జరుపుకుందాం

**గ్రామ పెద్దల సమావేశంలో లోకా ఫౌండేషన్ ప్రతినిధులు సునీల్ జి, లక్ష్మి దాసాజీ, బొప్పన రమేష్**



వరదయ్యపాలెం, డిసెంబర్ 25, ప్రభాతవార్త : మకర సంక్రాంతి (పెద్ద పండుగ)ను పురస్కరించుకుని సంస్కృతి, సంప్రదాయంలను కాపాడుకుంటూ బంధాలను బలపరచుకోవడానికి సూర్యనారాయణ హోమంను నిర్వహించుకుందాం అని గ్రామ పెద్దలతో లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి సునీల్ జి మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయంను అధ్యాత్మిక ఎదుగుదల మన అంతరంగానికి సంబంధించిందని, దాని యొక్క ఫలితాలు మనం చూస్తూ ఉంటామని అన్నారు. మనం నివసించడానికి భూమి ఉండాలి, ఆ భూమిని మనం ఎంత కాపాడగలం, దానికి హాని కలుగకుండా ఏమి చేయగలమో, చేయగలగాలి అన్నారు. ఉదాహరణు చుట్టు పక్కల గ్రామాలలో వినాయక చవితి నాడు మట్టి విగ్రహాలను నిమజ్జనం చేయడం జరిగిందని తెలుపుతూ గుర్తుకు తెచ్చారు. ఇందులో భాగంగా మకర సంక్రాంతిని పురస్కరించుకుని బొప్పన రమేష్ సూచనల మేరకు గోవర్ధనపురంలోకి లోకా ఫౌండేషన్ ప్రాంగణంలో సూర్యనారాయణ హోమం నిర్వహించడానికి గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయంను పెంపొందించే విధంగా ప్రణాళిక రూపొందించడం, అభినందనీయ అంశం అని, గంగిరెద్దులు, కోలాటలు, రంగవల్లులు, లాంటి సంప్రదాయమును వైభవంగా నిర్వహించేందుకు ముందుకు రావడం శుభ పరిణామం అని వరదయ్యపాలెం ఎంపిపి పద్మప్రియ భర్త దామోదర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు జ్యోతి, చంద్రారెడ్డి, శ్రీధర్ రెడ్డి, జడ్పిటిసి కుందాం వెంకటేశ్వర్లు, కల్లూరి బాలసుందరం, మాడస్వామి నవాబ్, ఖాదర్బాషా, సుబ్రమణ్యంరెడ్డి, గ్రామ పెద్దలు, పురోహిత, అర్చకులు, గ్రామస్తులు, మీడియా మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు చీరలు, పురుషులకు ప్యాంట్లు వితరణ




ఏర్పేడు (శ్రీకాళహస్తి రూరల్), డిసెంబర్ 25 ప్రభాతవార్త : మండల కేంద్రం సమీపంలోని ఇసిఐ చర్చిల్లో సోమవారం క్రిస్‌మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన క్రైస్తవులు హాజరయ్యారు. ప్రార్థనలకు ముఖ్యఅతిధిగా ఎంఎల్‌సి, రష్ అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం హాజరయ్యారు. ఆయనకు నిర్వాహకులు ఘనస్వాగతం చెప్పారు. ధాతృత్వ గుణం కల్గిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మహిళలకు చీరలు, పురుషులకు ప్యాంట్ షర్టులు వంద మందికి అందించారు. ఈ కార్యక్రమాల్లో వైకాపా మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్యయాదవ్, సర్పంచ్ల సంఘాధ్యక్షుడు నల్లపాళెం శివయ్య, డాక్టర్ వెంకట్రాది, చర్చి ఫాదర్‌లు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## కాసరం చర్చికి ఇన్వర్టర్లు వితరణ

తొట్టంబేడు, డిసెంబర్ 25 ప్రభాతవార్త : మండలంలోని కాసరంలో ఉన్న చర్చికి జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్‌రెడ్డి క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని సోమవారం చర్చి ప్రార్థనల్లో పాల్గొని ఫాస్టర్ ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈసందర్భంగా చర్చికి రెండు ఇన్వర్టర్లు వితరణగా అందించారు. ప్రార్థనల్లో సుమారు 300మందికి పైగా పాల్గొన్నారు. చర్చి అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఈసందర్భంగా భరత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఫాస్టర్ యేసుదానం, పిల్లమేడు సర్పంచ్ మణి, కనపర్తి ఎంపిటిసి సుబ్రమణ్యం, మహేష్‌నాయుడు, బాలాజీరెడ్డి, వంశీ, భాస్కర్, మాధవయ్య, డాక్టర్ కిషోర్, డాక్టర్ ప్రసాద్, నాగరాజు, కాలయ్య, ప్రజాపతి పరంధామయ్య, మనోహర్, సురేష్, ప్రతాప్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్ధనారీశ్వరాలయం వద్ద భక్తులకు అన్నదానం



తొట్టంబేడు, డిసెంబర్ 25 ప్రభాతవార్త : పవిత్ర స్వర్ణముఖినదీతీరాన విశాలపురంలో వెలసి ఉన్న అర్ధనారీశ్వరాలయంలో వెలసిన స్వామిఅమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మున్సిపల్ పరిధిలోని భాస్కరపేటలో ఉన్న సజ్జ చంద్రమౌళి కుటుంబసభ్యులు అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మాజీ మున్సిపల్ ఛైర్మన్ ముత్యాలపార్థసారధి విచ్చేసి సుమారు 500మంది భక్తులకు అన్నదానం చేశారు. సాధారణంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా ఉన్న అర్ధనారీశ్వ రాలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

## విగ్రహం అంధకారంలో ఆవిష్కరణ సబబేనా?

**-తెదేపా పట్టణ ప్రధాన కార్యదర్శి**

శ్రీకాళహస్తి, డిసెంబర్ 25 ప్రభాతవార్త : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పాలిట పెన్నిధి కీ.శే.వంగవీటి మోహనరంగా కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరణ బలిజ సోదరులకు అభినందనీయమే అయితే నియోజకవర్గంలో 2.30లక్షల ఉన్న జనాభాలో సింహభాగం బలిజ(కాపు)లు ఉన్న నేపథ్యంలో ఇన్ని దశాబ్దాలకు పైగా రంగా కాంస్య విగ్రహం ఆవిష్కరణ చీకటి మార్గంలో ఉన్న ఏరియ ఆస్పత్రిలోని చీకటి మార్గంలో ఏర్పాటు చేయడం సమంజసం కాదని తెలుగుదేశంపార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు.

## రుద్రభూమి స్మశాన స్థలంను పరిశీలించిన గ్రామపెద్దలు

**సరిచేసుకుందాం అంటూ ఏకాభిప్రాయం**



వరదయ్యపాలెం, డిసెంబర్ 25 ప్రభాతవార్త : వరదయ్యపాలెంలోని రుద్రభూమి స్మశాన స్థలంను గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. స్మశాన స్థలం 1.25 ఎకరాలు ఉందని, హద్దులు గుర్తించి, తదుపరి చర్యలు గై కొనుటకు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా గతంలో రాజేష్ పారిక్ సహకారంతో చేతి పంపు కోసం బోరు వేశారని తెలియజేస్తూ గది నిర్మాణం కొరకు కొంత ప్రణాళిక చేపట్టడం జరిగిందని పృథ్వి రవి గుర్తుకు తెచ్చారు. గతంలో అనుకున్న విధంగా గది నిర్మాణం చేపట్టాలని, అందుకు గ్రామస్తులు, యువత సహకారం తీసుకోవాలని రాష్ట్ర దేవాంగ సంఘం డైరెక్టర్ బొప్పన తిలక్ బాబు సూచించారు. వీలైనంత త్వరగా కార్యచరణ చేపట్టాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. సర్వే జరపడానికి, చదును చేయడానికి వీలైనంత త్వరలో చర్యలకు పునుకుందామని వరదయ్యపాలెం ఎంపిపి పద్మప్రియ భర్త దామోదర్ రెడ్డి అన్నారు. సమిష్టి కృషితో కార్యరూపం దాల్చేందుకు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బొప్పన మోహన్ మురళి, పన్నెం నిర్మల్, మాడస్వామి, కాంతిలాల్, కె. గోపాల్, పెరిశెట్ల ఉదయ్, బుర్రా కృష్ణమూర్తి, కల్లూరి యుగంధర్, పన్నెం శేఖర్, కల్లివెట్టు శేఖర్, ఎన్. వెంకటేశ్వర్లు, నాప వాసు, వలస శ్రీను, మోహన్ రావు, చంద్రశేఖర్, మన్నెం సామ్రాట్, కాట్న కుమార్, కల్లూరు వెంకటేశ్వర్లు, భాస్కర్, యన్నం భగవాన్, కేవీ వెంకటేశ్, కీర్తి గోపాల్, కట్టా గిరిబాబు, గుత్తి త్యాగరాజు, మీడియా నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## విజయపురం మండలాన్ని ఎడారిగా మార్చేస్తున్నారు

**బిజెపి నాయకులు నిషిధరాజు**



విజయపురం, డిసెంబరు 25 ప్రభాతవార్త : జిల్లా మైనింగ్ అధికారులు, మండల రెవెన్యూ అధికారులు కలిసికట్టుగా విజయపురం మండలాన్ని ఎడారిగా మార్చేస్తున్నారని బిజెపి మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు ఎం.నిషిధరాజు ధ్వజమెత్తారు. సోమవారం మండలంలోని పాతార్కాడులో జరుగుతున్న గ్రావెల్ క్వారీని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ పలుకుబడితో కొందరు ఇష్టానుసారం గ్రావెల్ తరలిస్తుంటే జిల్లా మైనింగ్ అధికారుల సూచన మేరకు మండల రెవెన్యూ అధికారులే సిబ్బంది ద్వారా గ్రావెల్ తరలించడానికి సహకరిస్తున్నారని విమర్శించారు. మండలంలోని పాతార్కాడు, మహారాజపురం, జగన్నాధపురంలో యదేచ్ఛగా గ్రావెల్ తమిళనాడుకు తరలిపోతోందని, ప్రశ్నించే వారిపై రౌడీలతో దౌర్జన్యం చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాతార్కాడు రెవెన్యూలో 62 ఎకరాల భూమిలో తప్పుడు ఎన్‌ఓసిలు సృష్టించి మట్టిని తరలించేశారన్నారు. రాళ్లు, రప్పలు, ముళ్ల చెట్లని దొంగ రికార్డులు సృష్టించి చదునైన వ్యవసాయానికి పనికి వచ్చే భూమిని ఇష్టానుసారం తవ్వేసి నాశనం చేశారని మండిపడ్డారు. మండలంలోని కొండలను మాయం చేయడానికి ఎత్తుగడ వేస్తున్నారని, కొండలు పోతే చెరువులు నిండవని, తినడానికి తిండి, తాగడానికి నీళ్లు దొరకకుండా ఎడారిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కైలాసం యాదవ్, సర్పంచ్ బొబ్బిలి, సీనియర్ నాయకులు పురుషోత్తం రెడ్డి, యుగందర్‌రాజు, యువ మోర్చా లేపాక్షి, మునికృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ వేణు, జానీ పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో చర్చిల్లో ప్రార్థనలు...పేదలకు సహాయం



శ్రీకాళహస్తి, డిసెంబర్ 25 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజక వర్గంలోని నాలుగుమండలాల్లోని చర్చిల్లో సోమవారం క్రిస్‌మస్ సందర్భంగా శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, ఆయన తనయ బియ్యపు పవిత్రారెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనల్లో పాల్గొన్నారు. పట్టణంలోని లూధరన్ చర్చిలో బియ్యపు పవిత్రారెడ్డి పాల్గొన్నారు. క్రిస్‌మస్ సందర్భంగా లూధ రన్ చర్చిని విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా తీర్చి దిద్దారు. ఆదివారం రాత్రి నుంచి క్రైస్తవ సోదరులు ఆట పాటలతో యువకులు, భక్తిభావంతో మధ్యవయస్కులు గడిపారు. ఇక్కడ క్రిస్‌మస్ ట్రీని ఏర్పాటు చేసారు. ఫాదర్ మైకేల్ బాబు మాట్లాడుతూ సమాజంను సన్మార్గంలో నడుపుటకు ఏసు జన్మించారన్నారు. శాంతి కరుణ, ప్రేమ, సహనం, సౌభాతృత్వం విశ్వమానవాళికి బోధించిన ఏసుక్రీస్తు జన్మించిన పవిత్ర దినం క్రిస్‌మస్ అన్నారు. ఈ ప్రార్థనల్లో వైకాపా నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి హాజరయ్యారు. ఆమెను ఫాదర్ ఆశీర్వదించారు. ఏర్పాట్లను అధ్యక్షుడు ఏ.మార్టిన్ బెంజిమెన్ ఉపాధ్యక్షుడు కే.రమేష్, కార్యదర్శి పికెజే అబ్రహం, కోశాదికారి జీవరత్నం సభ్యులు క్రాంతి కుమార్, సన్ని డయోల్, ప్రవీణ్‌కుమార్, అభివృద్ధి కమిటికి చెందిన జేసుదాసు, గాస్పెల్ లింకన్ మహిళా అధ్యక్షురాలు ఎం.కళావతి, ప్రశాంత్, రావిడ్ రాకేష్‌లు పర్యవేక్షించారు. కాగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత కోట హాజరయ్యారు. తెలుగుదేశం తరపున మాజీ టౌన్‌బ్యాంకు చైర్మెన్ డివి నారాయణ, వంకాయలసిద్దులయ్య హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

**శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో . . .**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో సోమవారం క్రిస్‌మస్ సందదర్భంగా చర్చిల్లో ఏసుప్రభువుకు సంబంధించి ప్రార్థనలు జరిపారు. కాసాతోటలోని లూథరన్‌చర్చి, కొత్తపేటలోని పునీతశౌరివారి చర్చి (కథలిక్‌చర్చి), ఇసిఐ, పెంతెకోస్తు, ఎల్ఇఎఫ్, బెతస్త ప్రార్థనా మందిరాలు, జెరూసలెంచర్చి, భక్తసింగ్‌చర్చి, పానగల్‌లోని చర్చి, ఎన్‌టిఆర్ నగర్, చెంచులక్ష్మీ కాలనీ, ఎంజిఎం పక్కన చర్చి, తెట్టు వద్ద ఉన్న ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపకాంతులతో దేదీప్యమానంగా అలంకరించారు. ఎటు చూసినా క్రిస్‌మస్ సంబరాలు, కొనుగోళ్ళుతో పట్టణం కళ కళలాడింది. ఈపండుగకు క్రైస్తవసోదరులు ప్రత్యేకంగా కేక్‌లను తయారు చేశారు. పునీతశౌరివారి చర్చి వద్ద ఏసుక్రీస్తు జననాన్ని సవివరంగా తెలియజేసే రూపాలను మట్టి బొమ్మలతో ఆకర్షణీయంగా మలచడంతో చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

## వైభవంగా క్రిస్‌మస్ పండుగ వేడుకలు



నారాయణవనం, డిసెంబర్ 25 ప్రభాతవార్త :మండలంలో క్రైస్తవసోదరులు సోమవారం భక్తి శ్రద్ధలతో క్రిస్‌మస్ పండుగ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా క్రైస్తవ సోదరులు ఉదయన్నే స్నానాన్ని ఆచరించిన తర్వాత కొత్తబట్టలను ధరించిన తర్వాత ఒకరి కొకరు క్రిస్‌మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ప్రార్థన మందిరాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. మండలంలోని భీమునిచెరువులోని లూధరన్ చర్చ్‌లో ఫాస్టర్ల ఆధ్వర్యంలో చిన్నపిల్లలకు వివిధరకాల పోటీలను, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను అందించారు. మండలంలోని అన్ని దళితవాడల్లో వెలసిన క్రైస్తవ మందిరాల్లో క్రిస్‌మస్ పండుగను జరుపుకున్నారు.

## కైలాసనాధుని సేవలో డిప్యూటీ కలెక్టర్



నారాయణవనం, డిసెంబర్ 25 ప్రభాతవార్త : మండలంలోని అరణ్యంకండ్రిగ పంచాయతీ కైలాసనాధ కోనలో వెలసిన కామాక్షాంబిగా సమేత కైలాసనాధున్ని ఆదివారం డిప్యూటీ కలెక్టర్ నాగార్జున్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసిదర్శించుకున్నారు. ఆలయ పాలకమండలి ఛైర్మన్ ఇ సుబ్రమణ్యంయాదవ్ ఆయనకు ఘన స్వాగతం పలికిన తర్వాత స్వామి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులచే వేద మంత్రాలతో ఆశీర్వాదించారు. అంతకుముందు పవిత్ర జలపాతంలో స్నానం చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందించారు.

## అభివృద్ధి ప్రధాతకు ఘననివాళులు



సత్యవేడు, డిశంబరు 25 ప్రభాతవార్త: దివంగత భారత మాజీ ప్రధాని, అభివృద్ధి ప్రధాత అటల్ బీహార్ వాజ్‌పేయి జయంతిని సత్యవేడు మండల భాజపా అధ్యక్ష్యుడు మునిప్రతాప్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సత్యవేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వాజ్‌పేయి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులు అర్పించి, ఆపార్టీ జెండాను ఎగురవేశారు. దేశ అభివృద్ధిలో కీలకపాత్ర వహించి ప్రజలకు సుపరిపాలన అందించిన మహానేత వాజ్‌పేయి అని నాయకులు కొనియాడారు. ఈకార్యక్రమంలో భాజపా నాయకులు వెంకటేశ్వర్లురెడ్డి, మోహన్‌బాబు, ఎర్రశెట్టి, వెంకటేశ్వర్లు, మునికృష్ణయ్య, వాసు, మురళీకృష్ణ, శ్రీకాంత్, మహిళా మోర్చా అధ్యక్ష్యురాలు ఉష లు పాల్గొన్నారు.

## పుత్తూరులో ఘనంగా వాజ్‌పాయ్ జన్మదిన వేడుకలు



పుత్తూరురూరల్, డిసెంబరు 25 ప్రభాతవార్త: భారత మాజీ ప్రధాని, భారత రత్న, భరతమాత ముద్దుబిడ్డ శ్రీ అటల్ బిహారీ వాజపేయి జన్మదినం సందర్భంగా వారు చేసిన సేవలను స్మరించు కుంటూ పుత్తూరు భారతీయ జనతా పార్టీ నాయకులు ఆ మహనీయుని పటానికి పూలమాల సమర్పించి ఘన నివాళులర్పించారు. కార్యక్రమం లో ముఖ్యవక్తగా పాల్గొన్న బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు శ్రీ గుత్తా నారాయణ స్వామినాయుడు మాట్లాడుతూ వాజ్‌పాయ్ భారత రాజకీయాల్లో సుదీర్ఘకాలం, దాదాపు ఐదు దశాబ్దాల పాటు దిగువ, ఎగువ సభల్లో భారత పార్లమెంట్ సభ్యునిగాను మూడు సార్లు ప్రధానిగా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వాజ్‌పేయి భారత రాజకీయాల్లో నవ భారత భీష్ముడుగా వెలుగొందారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కోట కొండ బాబు, పుత్తూరు రూరల్ మండల అధ్యక్షుడు మురళి, జిల్లా చేనేత కార్యదర్శి వెంకటేష్, మండల ఓబీసీ అధ్యక్షుడు హరి, సీనియర్ నాయకులు శేఖర్, బాబునాయుడు, ఎం.కె.సుబ్రహ్మణ్యం, నాయకులు గిరిప్రసాద్, గోపి, ఏకల్ అభియాన్ ప్రతినిధులు లక్ష్మిరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

పుత్తూరురూరల్, డిసెంబరు 25 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగింది. సోమవారం ఏసుక్రిస్తు పుట్టిన రోజు పురస్కరించుకుని క్రైస్తవులు ఆలయంలో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాన్ని చేపట్టారు. పుత్తూరు వెస్ట్ చర్చి, ఈస్ట్ చర్చి వేపగుంట, కృష్ణసముద్రం, రామసముద్రం, పరమేశ్వర మంగళం, తిరుమలకుప్పం, కేబీఆర్ పురం తదితర గ్రామాల్లో ఘనంగా జరిగింది. పుత్తూరు పట్టణ రూరల్ ప్రాంతాల్లో చర్చిలను భక్తులు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆరాధన జరిగింది. ఆలయ ఫాస్టర్లు దేవుని సందేశాన్ని పుట్టుక దినాన్ని భక్తులకు వివరించారు. అనంతరం భారీ కేక్‌ని కట్ చేసి భక్తులకు అందజేశారు. వేపగుంటలో సుమారు 50 మంది పేద కుటుంబాలకు చీరలు పంపిణీ చేశారు.

## లిడ్‌క్యాప్ భూముల్లో అక్రమాలు కూల్చివేత

తిరుపతి, డిసెంబర్ 25ప్రభాతవార్త: పాతరేణిగుంట రోడ్డులోని లిడ్‌క్యాప్ భూముల్లో అక్రమనిర్మాణాలను లిడ్‌క్యాప్ భూముల పరిరక్షణ కమిటీ నేతలు, దళిత సంఘాలు సోమవారం కూల్చివేశాయి. దళితుల కోసం కేటాయించిన భూమిలో కబ్జాదారులు అక్రమ నిర్మాణాలు చేపట్టారని తెలుసుకుని అక్కడకు చేరుకున్న పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌడపేర చిట్టిబాబు, దళితనాయకులు గంగాధరం, కాటయ్య, వివిధ దళితసంఘాల నాయకులు లిడ్‌క్యాప్ భూముల ఆక్రమణలపై తాశీల్దార్‌కు ఫోన్‌ద్వారా వివరించారు. అనంతరం ఆక్రమణలను కూల్చివేశారు. లిడ్‌క్యాప్ భూములను ఆక్రమించుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని దళితసంఘాలనాయకులు హెచ్చరించారు.

## తిరుపతిలో గెలిచి పవన్ కళ్యాణ్‌కు బహుమతిగా ఇద్దాం




తిరుపతి టౌన్, డిసెంబర్ 25 ప్రభాతవార్త: తిరుపతి అసెంబ్లీ సీటును గెలిచి పవన్ కళ్యాణ్‌కు బహుమతిగా ఇస్తామన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ సోమవారం తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన తిరుపతి నియోజకవర్గ సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిలో జనసేన – టిడిపి అభ్యర్థిని గెలిపించాలని ఏకవాక్య తీర్మాణం చేసారు. అనంతరం డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గంలో జనసేన పార్టీని బలోపేతం కావాలని కోరారు. డివిజన్ ఇన్చార్జిలతో పాటు బూత్ కమిటీలు ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఆలోచనలను, జనసేన సిద్ధాంతాలను గడపగడపకు తీసుకెళ్లాలన్నారు. ఎన్నికలకు సమయం చాలా తక్కువగా ఉన్నందువల్ల ప్రతి జనసేన కార్యకర్త ఒక సైనికుడిగా పనిచేయాలన్నారు. బూత్‌లలో ఓటర్ల వివరాలను గుర్తించి వారికి పార్టీ సిద్ధాంతాలను వివరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఇంచార్జి కిరణ్ రాయల్, నగర అధ్యక్షులు రాజారెడ్డి, రాష్ట్ర, జిల్లా, నగర కార్యవర్గ సభ్యులు, వార్డు అధ్యక్షులు జనసైనికులు, మహిళలు పాల్గొన్నారు.

## ఏసు క్రీస్తు జన్మదినం మనందరికీ పర్వదినం



చంద్రగిరి, డిశంబర్ 25 ప్రభాతవార్త: ఏసు క్రీస్తు జన్మదినం మనందరికీ పర్వదినమని తుడా చైర్మన్, ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. స్థానిక చర్చి వీధిలోని సౌత్ ఆంధ్ర లూధరన్ చర్చిలో సోమవారం ఉదయం ఆయన క్రిస్మస్ వేడుకలలో పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు చేసుకుని చర్చి ఫాదర్ రెవరెండ్ దీపక్ బాబు ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాతత్పరత, క్షమగుణాన్ని, ప్రేమాభిమానాన్ని బోధించే ఏసుక్రీస్తు మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజలు క్షమ, దయ, ప్రేమ, కరుణ వంటి సుగుణాలను క్రీస్తు నుండి ప్రేరణ పొందాలన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని నియోజకవర్గంలోని చర్చిలకు రూ.25 వేలు విలువైన మైక్ సెట్‌లను విరాళంగా అందజేశారు. అనంతరం క్రైస్తవ సోదరులు, పార్టీ నాయకులతో కలసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నాయిబ్రాహ్మణ కాలనీ, జోగల కాలనీ, వికలాంగుల కాలనీ, కొత్తపేట, ఇందిరమ్మ కాలనీలలోని చర్చిలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, ఎంపిటిసి మాదవరెడ్డి, వైసిపి నాయకులు పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, ముద్దికుప్పం రూపరామమూర్తి, చైర్మన్ టి.మూర్తి, సెక్రటరీ మిరియాల నజరత్, సి.ఎం.కేశవులు, దుర్గం దేవి మునిరాజ, కొత్తపాటి కోటిరెడ్డి, సూరి, సిద్ధిఖ్ భాషా, బండారు హేమచంద్రారెడ్డి, పి.భాస్కర్, మిరియాల జ్యోతి ప్రసన్న, డి.ఎస్.రమ, వై.అనూరాధ, టి.రాణెమ్మ, ఎం.జోసెఫ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రదాని వాజ్‌పాయ్ జయంతి వేడుకలు

చంద్రగిరి, డిశంబర్ 25 ప్రభాతవార్త: దివంగత మాజీ ప్రదాని అటల్ బిహారీ వాజ్‌పాయ్ జయంతి వేడుకలు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.వెంకటముని ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుబ్రమణ్యం యాదవ్, నాయకులు సక్కుర్ మునిగంగిరెడ్డి, ఎస్.దొరస్వామి, నరేష్‌కుమార్ నాయుడు, లక్ష్మీదేవి, ఎస్.వెంకటాద్రి, దీనదయాళ్ నాయుడు, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

## క్రీస్తు మార్గాన పయనిద్దాం : ఎమ్మెల్యే



రేణిగుంట, డిసెంబరు 25 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరు క్రీస్తు మార్గాన్ని అవలంభించినప్పుడు ప్రపంచం శాంతి మయమవుతుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని రేణిగుంట పట్టణం, మండలంలోని అన్ని చర్చిలు, క్రీస్తు ప్రార్థన మందిరాల్లో ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు చర్చిల్లో క్రీస్తు జననానికి సంబంధించిన బొమ్మల ప్రదర్శన అందరిని ఆకట్టుకున్నాయి. ఫాదర్లు, ఫాస్టర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించగా క్రీస్తు ప్రేమికులు క్రైస్తవ భక్తి గీతాలు ఆలపించారు. క్రైస్తవ ప్రార్థన మందిరాలతో పాటు చర్చిలు విద్యుత్ దీపాలంకరనలతో దేదీప్యమానంగా వెలిగాయి. పట్టణంలోని వివిధ చర్చిలను, ప్రార్థనా మందిరాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని క్రైస్తవ పెద్దల ఆశీర్వాదాలు అందుకున్నారు. రేణిగుంట లూథరన్ చర్చి, జెరూసలీం అపోస్తలిక్ చర్చి కార్యక్రమాల్లో పాల్గొని నిరుపేదలకు, వికలాంగులకు నూతన వస్త్రాలు, స్టీల్ ప్లేట్లను తన స్వహస్తాలతో అందజేశారు. కార్యక్రమంలో రేణిగుంట సర్పంచ్ నాగేషంతో పాటు పలువురు మండల, పట్టణ వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## శివభక్తులకు సహాపంక్తి భోజనాలు అందిస్తున్న పాలస్వామి



శ్రీకాళహస్తి, డిసెంబర్ 25 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తి శ్రద్ధలతో వచ్చే భక్తులకు అలాగే చుట్టుపక్కల గ్రామాల నుంచి పట్టణానికి వచ్చి తిరిగి వెళ్ళే ప్రజలకు మధ్యాహ్నం భక్తుల భాగస్వామ్యంతో భోజనాలు అందిస్తున్నారు. స్టార్ హోటళ్ళ స్థాయిలో భోజనాలు అందిస్తున్నారు. మూడు రోజులుగా భక్తుల తాకిడి అధికమైంది. దాంతో పొగస్వామి సామాజిక సేవల్లో తరిస్తున్నారు. శ్రీకాళహస్తి పట్టణానికి చుట్టుపక్కల దళిత, గిరిజన వాడల్లో చిన్నారులతో పాటు ఆలయానికి వచ్చే చిన్నారులకు తన వంతు సహాయంగా పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు పొగస్వామి. శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధికి సుమారు పాతిక సంవత్సరాల క్రితం ఇక్కడకు వచ్చి స్థిరపడి సామాజిక కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి రోజూ వందలాది మందికి సహపంక్తి భోజనాన్ని దాతల సహకారంతో అందిస్తున్నారు. అలాగే దాతలు అందించిన ఆవుల ద్వారా వచ్చే పాలలో కొంత భాగం స్వయంభువు అభిషేకాలకు అందిస్తున్నారు. ప్రతి రోజూ సుమారు వంద లీటర్ల పాలను చిన్నారులకు అందిస్తున్నారు. ఆలయం నుంచి స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం జరిగే సమయంలో స్వామి అమ్మవార్ల ముందు మొలక సాంబ్రాణి పొగ వేయటంతో ఆయనకు పొగస్వామి అని పేరు వచ్చింది, సామాజిక సేవలో పొగస్వామి తరిస్తున్నారు.

## చర్చి వద్ద అన్నదానం చేస్తున్న పవిత్రమ్మ



శ్రీకాళహస్తి, డిసెంబర్ 25 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని లూధరన్ చర్చి వద్ద సోమవారం వైకాపా నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో ప్రార్థనల్లో పాల్గొన్న పవిత్రమ్మ అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన అన్నదానాన్ని విశ్వాసులకు అందించారు. ఈ కార్యక్రమాల్లో చర్చి అధ్యక్షుడు మార్టిన్, వైయస్‌ఆర్‌సిపి నాయకులు నాని, ప్రేమ, కిరణ్, ప్రసాద్, ఏసు, హరి, డేవిడ్, సుప్రియ, హేమ తదితరులు పాల్గొన్నారు.

## జగ్గరాజుపల్లి చర్చికి ఏసి వితరణ




శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 25 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలంలోని జగ్గరాజుపల్లి చర్చికి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఏసిని వితరణగా అందించారు. సోమవారం చర్చిలో ఏసు జననానికి సంబంధించి క్రిస్‌మస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ పూజలకు బియ్యపు మధుసూధనరెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవిత్రమ్మ మాట్లాడుతూ సమాజంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలన్నారు. గ్రామంలోని సెయింట్ మార్క్ ప్రార్థనాలయా నికి ఏసి వితరణ చేసారు. ఫౌండర్ చైర్మెన్ మోహనయ్య, సంఘ పెద్దలు గున్నయ్య, ధన, కోటి, కిషోర్‌కుమార్, నాగరాజు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అజాత శత్రువు అటల్‌బీహారి వాజ్‌పేయి



శ్రీకాళహస్తి, డిసెంబర్ 25 ప్రభాతవార్త : భారతదేశ ముద్దుబిడ్డ, భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్‌బీహారి వాజ్‌పేయి 99వ జయంతి సందర్భంగా స్థానిక బేరివారి మండపం వద్ద రాష్ట్ర బిజెపి కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోలా ఆనంద్ కుమార్, పట్టణ అధ్యక్షుడు గరికపాటిరమేష్‌బాబు ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. వీరు మాట్లాడుతూ భారతీయ జనతాపార్టీ వ్యవస్థాపకులు అటల్జీ వారి జీవితాన్ని భారతదేశ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేశారన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, రాష్ట్ర సభ్యులు కండ్రిగ.ఉమ, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటిగోపాల్, ఉమాసింగ్, పట్టణ ప్రధాన కార్యదర్శిలు కోనేటి అయ్యప్ప, మద్దు వాసు యాదవ్, పుణ్యండిల్లీకుమార్, సొట్టసుకుమార్, కన్నా వెంకటేశ్వర్లు, జివి.అమర్‌నాథ్, పిళ్ళారిబత్తినయ్య, ఘట్టమనేని కృష్ణమూర్తి, ఇమ్మిడిశెట్టి మోహన్, పగడాల ప్రతాప్, కలపాటిమోహన్, సిరిపురం సుధాకర్, సజ్జహరీష్, రాజనరసింహులు, అబ్దుల్లాఖాన్, నాని, సాయిలు పాల్గొన్నారు.

# ఈనెల 28-30తేదీల్లో కుప్పంలో చంద్రబాబు పర్యటన



కుప్పం, డిసెంబర్ 25 ప్రభాతవార్త : ప్రతిపక్ష నేత, మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడు ఈనెల 28-30తేదీల్లో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్న విషయం విదితమే. చంద్రబాబు పర్యటనకు సంబంధించి ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు పర్యటన షెడ్యూలు ఇలా ఉంది. ఈనెల 28వతేది హైదరాబాదునుంచి బెంగళూరుకు విమానంలో చేరుకుంటారు. అక్కడ బెంగళూరు తెదేపా ఫోరం నేతలతో సమావేశం అవుతారు. అలాగే బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నియోజకవర్గ కార్యకర్తల సంక్షేమ విభాగం అధ్యక్షుడు డిఎస్ త్రిలోక్‌ను పరామర్శిస్తారు. అనంతరం అక్కడ నుంచి బయలుదేరి కర్ణాటకలోని కోలారు, కెజిఎఫ్ మీదుగా గుడుపల్లె మండలకేంద్రానికి చేరుకుంటారు. అక్కడ బహిరంగసభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం అక్కడనుంచి కుప్పం వచ్చి తన వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శిస్తారు. అక్కడ నుంచి ఆర్అండ్‌బి అతిథిగృహం చేరుకుని బస చేస్తారు. 29న ఉదయం అతిథిగృహంలో ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం మధ్యాహ్నం శాంతిపురం, సాయంత్రం రామకుప్పంలో జరిగే బహిరంగ సభల్లో బాబు ప్రసంగిస్తారు. అనంతరం కుప్పం చేరుకుంటారు. 30వతేది ఉదయం అతిథిగృహంలో ప్రజలనుంచి వినతులు సీ్వకరిస్తారు. అనంతరం పిఇఎస్ వైద్య కళాశాల సమీపంలో శ్రీ కనకదాస విగ్రహంను ఆవిష ్కరిస్తారు. అక్కడనుంచి నేరుగా కుప్పం బస్టాండు చేరుకుని బహిరంగసభలో ప్రసంగిస్తారు. అక్కడ నుంచి కొత్తపేటలో వెలసిన శ్రీ ప్రసన్న పెద్దపులి గంగమ్మ ఆలయం, కొత్తపేట మసీదులను సందర్శిస్తారు. అనంతరం మల్లానూరు చేరుకుని అక్కడ బహిరంగసభలో ప్రసంగిస్తారు. పచ్చూరు, కృష్ణగిరి మీదుగా బెంగళూరు చేరుకుంటారు. ఈ పర్యటన షెడ్యూల్‌లో సమయానుకులంగా కొంత మార్పులు జరిగే అవకాశం ఉంది.

**చంద్రబాబు పర్యటన జయప్రదం చేయాలి : ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్**

ఈనెల 28-30 తేదీల్లో మాజీ సిఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ కోరారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 30వతేది కుప్పం బస్టాండు, మల్లానూరులో జరిగే బహిరంగ సభల్లో చంద్రబాబు పర్యటిస్తారన్నారు. సమావేశంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాష్ట్ర నేతలు గోపీనాథ్, కాణిపాకం వెంకటేష్,ప్రధాన కార్యదర్శి ఆర్ముగం, నేతలు సత్యేంద్రశేఖర్, కన్నన్, రవి, కౌన్సిలర్లు సోమశేఖర్, సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రోగాలకు నిలయంగా గ్రామాలు

**- వీధుల్లోని మురికిలో వృద్ధి చెందుతున్న దోమలు - పట్టించుకోని అధికారులు**



దొరవారిసత్రం, డిసెంబర్ 25 ప్రభాతవార్త: గ్రామాలు రోగాలకు నిలయంగా మారుతున్నాయి. సీజనల్ వ్యాధులు తోడవడంతో పల్లెలంతా రోగాలమయంగా మారుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. దొరవారిసత్రం మండలం అక్కరపాక, పోలిరెడ్డి పాలెం, ముత్తరాశి పాలెం, సూరపుఅగ్రహారం, ఏకొల్లు, వెదురుపట్టు తదితర గ్రామాల్లో ఉన్న గుంటల్లో వర్షపు నీరు చేరి మురికిమయంగా మారిపోయాయి. దీనికితోడు సీజనల్ వ్యాధులు కూడా గ్రామాల్లో ప్రారంభం కావడంతో మురికి నీళ్లలో లార్వాలు పెరిగి రాత్రి వేళల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రామాల్లో వైరల్ జ్వరాలు వ్యాపిస్తుండటంతో వృద్ధులు, పిల్లలు ఎక్కువ సంఖ్యలో ఆసుపత్రుల పాలవుతున్నారు. అయితే పట్టించుకోవాల్సిన పాలకులు గాని, అధికారులు గాని గ్రామాల్లో మురికి వాడలను కన్నెత్తి కూడా చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మురికి గుంటల్లో దోమల ఉత్పత్తి పెరిగిపోయి సాయంత్రం 6 గంటలైతే దోమల బెడదతో ప్రజలు, మూగజీవాలు అల్లాడిపోతున్నాయి. ఇప్పటికైనా గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ చూపి లార్వా నియంత్రణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## వినూత్న రీతిలో అంగన్‌వాడీల నిరసన



కోట,డిసెంబర్ 25 ప్రభాతవార్త : కోట ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తల చేపట్టన నిరవధికసమ్మె సోమవారం కు 14 రోజు చేరుకుంది. ఒక్క అవకాశం అని ఓట్లు వేయించుకుని నిండా ముంచేశావు, ఇప్పుడు మా మొరను అలకించ లేవా ఓ జగనన్నా అంటూ గీతాలు ఆలపించారు, ఈ సందర్భంగా వారు ఒంటి కాళ్ల పై నిలబడి వినూత్న రీతిలో నిరశన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా యూనియన్ అధ్యక్షరాలు ప్రమీల మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మనసు కరగడం లేదని ఆరోపించారు. అంగన్‌వాడీల డిమాండ్లు న్యాయమైనవి, ఈనెల 31 తర్వాత ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కనీసం వేతనం 26 వేలు ,గ్రాట్యుటితో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలంటూ సమ్మె చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 55,607 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. దాదాపుగా లక్ష మంది వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల ఉన్నారని వీరంతా సమ్మెలో కొనసాగుతున్నారని ఆమె చెప్పారు.ఈ నిరశనలో కోట,వాకాడు,చిట్టమూరు మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి!



ఓజిలి, డిసెంబర్ 25 ప్రభాతవార్త : ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన ఓజిలి మండలం పెద్దపరియ అరుంధతీయవాడలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పారిచర్ల చెంగమ్మ (43) అనే వివాహిత ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తుంది. ఆమె భర్త ఇంట్లో లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సోమవారం ఇరుగు పొరుగు వారు చెంగమ్మ ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో ఇంటికి వెళ్లి చూడగా మృతిచెంది ఉంది. గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న నాయుడుపేట సీఐ వైవీ సోమయ్య, ఓజిలి ఎఎస్ఐ రాధమ్మ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. భువనగిరిపాలెం గ్రామానికి చెందిన శివకుమార్ అనే వ్యక్తిని అనుమానంతో గ్రామస్థులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా హనుమాన్ చాలీసా యజ్ఞ భజనలు



కాణిపాకం, డిసెంబర్ 25 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో సోమవారం శ్రీహనుమాన్ చాలీసా యజ్ఞభజన గానామృతం కార్యక్రమంను అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరామాంజనేయ నామ సంకీర్తన భజన మండలి ఉదయ్ కుమార్ శర్మ భాగవతార్ చెన్నై వారిచే స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం నుండి సాయంత్రం వరకు హనుమాన్ చాలీసా భజన బృందంచే హనుమాన్ చాలీసా మహా యజ్ఞ భజన గానామృతం కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా 108 హనుమాన్ చాలీసా సంకీర్తనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, స్థానిక సర్పంచ్ కెఎస్. శాంతిసాగర్‌రెడ్డి, రామాయణ హరినాథరెడ్డి, నిర్వహకులు భాస్కర్‌నాయుడు, జగదీశ్వరనాయుడులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

సదుం,కల్లూరు,డిసెంబరు25ప్రభాతవార్త: మండల పరిదిలోని సదుం, నడిగడ్డ,యర్రాతివారిపల్లె, బూరగమంద రామాపురం, పాలమంద, గుండ్లూరువారిపల్లె,గొంగివారిపల్లె డాన్‌బాస్కోలలో సోమవారం క్రిస్మస్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఏసు ప్రభువుపైన పాటలు పాడారు. పాస్టర్‌లు క్రీస్తు బోధనలు వివరించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. పులిచెర్ల మండలంలోని కల్లూరు బీసీ కాలనీలో ఉన్న క్రైస్ట్ చర్చిలో క్రిస్మస్ పండుగను జరుపుకున్నారు. ఫాస్టర్ ధనరాజ్ ఆధ్వర్యంలో ఆరాధన కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అన్నదానం ఏర్పాటు చేసి పేదలకు నూతన వస్త్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో సర్పంచి నటరాజ్,గంగయ్య, సుశీల,టైటస్, రీన, రాజేస్,జాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర ప్రారంభానికి నేడు ముహుర్తం

**- జిల్లాలో 47 రోజుల పాటు క్రీడా సంబరాలు**

**- మెసానికల్ గ్రౌండ్స్‌ను పరిశీలించిన జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి**



చిత్తూరు, డిసెంబర్ 25 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు చిత్తూరు మెసానికల్ గ్రౌండ్స్ వేదికను కలెక్టర్ సగిలి షన్మోహన్ ఖరారు చేయడంతో సోమవారం జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి మెసానికల్ గ్రౌండ్స్‌ను క్రీడా సంబరాలు ప్రారంభ కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయిలో మంగళవారం నుండి ఫిబ్రవరి 26వ తేదీ వరకు ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 47 రోజుల పాటు ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలు జరుగుతాయన్నారు. ప్రస్తుత టెక్నాలజీ యుగంతో 15 సంవత్సరాలు నిండిన యువతను క్రీడల్లో ప్రోత్సహించి వారి ఆరోగ్యంను పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. యువత క్రీడల ప్రాధాన్యత తెలుసుకోవాలనేదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. మొత్తం ఐదు క్రీడాంశాల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ క్రీడల్లో పోటీలు జరుగుతాయని వెల్లడించారు. జిల్లా స్థాయిలో క్రీడలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ ఆథారిటీ అధికారి బాలాజీ, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## డిసిసిబి క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి పెద్దిరెడ్డి



చిత్తూరు, డిసెంబర్ 25 ప్రభాతవార్త: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు-2024 క్యాలెండర్‌ను రాష్ట్ర భూగర్భ గనులు, అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. డిసిసిబి ఛైర్‌పర్సన్ రెడ్డమ్మ కృష్ణమూర్తి, సిఇఓ మనోహర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో డిసిసిబి కార్యవర్గ సభ్యులు సోమవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలో ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా డిసిసిబి రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ డిసిసిబి బ్యాంకు దిన దినాభివృద్ధి చెందుతూ రైతులకు దీర్ఘ, స్వల్ప కాలిక రుణాలను మంజూరు చేస్తే వాణిజ్య బ్యాంకులకు ధీటుగా డిసిసిబి సైతం నెఫ్ట్, ఆర్‌టిజిఎస్, ఏటిఎం, ఐఎంపిఎస్, ఇకామ్, పాస్ లాంటి ఆధునిక ఫండ్ ట్రాన్స్ఫర్ సౌకర్యాలు కల్పిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు పాలకవర్గ సభ్యులు కరుణాకర్‌చౌదరి, హరినాథ్‌రెడ్డి, మస్తాన్‌సాహెబ్, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## వాజ్‌పేయ్‌తోనే దేశంలో ఆర్థికస్వాంతన ప్రారంభం

**-గన్నా మదన్‌మోహన్**



పుంగనూరు,డిసెంబరు 25 ప్రభాతవార్త : సుదీర్ఘమైన దారుణ కాంగ్రెస్ పాలన తరువాత,దివంగత ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయ్‌గారి సంస్కరణలతోనే దేశం ఆర్థికంగా,సామాజికపరంగా తలెత్తుకుని నిలబడిందని నియోజకవర్గ బిజెపి కన్వీనర్ గన్నామదన్‌మోహన్ అన్నారు. సోమవారం పట్టణంలో ఆయన అధ్వర్యంలో వాజ్‌పేయ్ జయంతిని నిర్వహించుకునా న్నరు. ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రతి ఒక్కరికీ కేంద్రపథకాలు అందాలని, ప్రతి పౌరుడూ ఆర్థికంగా ఎదగాలనే ధ్యేయంతో పాలనసాగించార న్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సిఎస్ రాజారెడ్డి మాట్లాడుతూ ప్రధానిగా దేశఖ్యాతిని అటల్ బిహారీ వాజ్‌పేయ్ ఇనుమడింపచేశారన్నారు. ముఖ్యఅతిథిగా రాజంపేట బిజెపి కార్యదర్శి ఆకుల కృష్ణమూర్తి పాల్గొన్నారు. పట్టణాధ్యక్షుడు బాబు అధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సపొందుతున్న వారికి పాలు,పండ్లు పంపిణీచేశారు. జిల్లా ఉపాధ్యక్షురాలు మల్లికారాణి, పార్టీ సీనియర్ టివిఎస్ ప్రసాద్,జిల్లా కార్యదర్శి వెంకటరమణనాయుడు,అసెంబ్లీ కోకన్వీనర్ ప్రేమ్, కుమార్‌రాజ, చిట్టి, విశ్వనాధనాయుడు, మణి,శంకర్, సోషియల్ మీడియా నవీన్,అజయ్,మండల అధ్యక్షుడు వెంకటరమణ నాయుడు,పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్సాహభరితంగా పండుగను జరుపుకున్న క్రైస్తవ సోదరులు



నగరి, డిసెంబరు 25 ప్రభాతవార్త: క్రిస్మస్ పండుగను నియోజకవర్గం వ్యాప్తంగా క్రైస్తవ సోదరులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వేకువ జామున నుంచే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కొత్త దుస్తులు ధరించి ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. ప్రత్యేక ఆరాధనలో పాల్గొని కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థించారు. చర్చిలను రంగు రంగుల కాగితాలతోను, విద్యుత్ దీపాలతోను ప్రత్యేకంగా అలంకరించారు. చర్చి ఫాదర్లు క్రైస్తవ సోదరులకు సువాక్యములను బోధించారు. జీసస్ పుట్టిన రోజు కేక్ కట్ చేసి పలువురికి విందు భోజనం పెట్టారు. ఈ సందర్భంగా వారు ఇళ్ళ వద్ద ఏర్పాటు చేసుకున్న బాల ఏసు పాక, క్రిస్మస్ ట్రీలు ఆకర్షణగా నిలిచాయి. పిల్లలు ఇష్టపడే వస్తువులను పెద్దలు గిఫ్ట్ బాక్సులుగా కట్టి క్రిస్మస్ ట్రీకి వేలాడదీశారు. ఈ అలంకరణలను చూడడానికి పలువురు ఉత్సాహం చూపారు. సీఎస్ఐ చర్చి, సీఎస్ఐ వెస్లీ చర్చిల్లోను, సెయింట్ మేరీ చర్చిలో, ఆర్‌సీఎం, ఎల్ఈఎఫ్ చర్చిల్లోను గ్రామ గ్రామాన ఉన్న చర్చిల్లోను క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. జనసమూహం ఎక్కువగా ఉండడంతో చర్చిల వద్ద చిన్నారులను ఆకర్షించే రంగుల రాట్నాలు తిను బండారాల విక్రయాల విక్రయ దుకాణాలు వెలిశాయి.

## కె.బి.ఆర్.పురంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



పుత్తూరు, డిసెంబరు 25 ప్రభాతవార్త : రూరల్ మండలం పరిధిలోని కెబిఆర్ పురం పంచాయతీలో మాజీ ఉప సర్పంచ్ మగేష్ ఆధ్వర్యంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తూరు మాజీ ఎంపిపి, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య మాట్లాడుతూ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాశ్ తరపున ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు బోధనల మేరకు సమాజంలో అందరూ శాంతి, సామరస్యంతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం ఉప సర్పంచ్ ఏర్పాటు చేసిన 25 కేజీల బియ్యం, ఒక కేజీ కందిపప్పు, ఒక లీటరు వంట నూనె, కేక్‌లు నిరుపేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షులు మోహన్‌రాజు, చెరకు కరుణ యాదవ్, తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, మాజీ ఎంపిటిసి కోట గజపతి, టిడిపి నాయకులు సుబ్రమణ్యం, గోపినాథ్, షణ్ముగం, మాజీ సర్పంచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

## ఇద్దరు అమ్మాయిలు కనిపించడం లేదని ఫిర్యాదు

వడమాలపేట, డిసెంబరు 25 ప్రభాతవార్త: వడమాలపేట గుంటకట్ట వీధిలో నివాసం ఉంటున్న అబ్దు రషీద్ కుమార్తెలు కనిపించడం లేదని సోమవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేస్త్రి పని చేసే అబ్దుల్ రషీద్, బధోని దంపతులకు మస్తాని(13), అఫ్రిన్(5) ఇద్దరు కుమార్తెలు కుటుంబ కలహాల వల్ల బధోని గత కొంత కాలంగా తిరుత్తణిలోని అమ్మగారి ఇంటిలో ఉంటుంది. అబ్దుల్ రషీద్ ఇద్దరి పిల్లలను బంధువు రాజీయా వద్ద వదిలి పనుల నిమిత్తం రేణిగుంట మండలం అనాసంపల్లి వద్ద ఉంటున్నాడు. అయితే ఇద్దరు పిల్లలు సోమవారం ఉదయం నుంచి కనిపించడం



లేదని రాజియా సాయంత్రం వడమాలపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రైనీ డీఎస్పీ సింధుప్రియ ఆదేశాల మేరకు కేసు నమోదు చేశారు. పిల్లలు తిరుత్తణిలోని అమ్మవాళ్ళ ఇంటికి వెళ్లి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

## శాంతిని ప్రవచించిన జీసెస్: జయప్రకాశ్



పుత్తూరు, డిసెంబరు 25 ప్రభాతవార్త : ఏసుక్రీస్తు ప్రపంచ శాంతిని కోరుకున్నారని మునిసిపల్ వైస్ ఛైర్మన్ డి.జయప్రకాశ్ (చిట్టి) అన్నారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని సోమవారం స్థానిక ఎజీవో కాలనీలోని చర్చ్ ఆఫ్ క్రీస్ట్, అబ్రహం చర్చ్ ఆఫ్ క్రీస్ట్, కింగ్ ఆఫ్ కింగ్ చర్చ్‌లను సందర్శించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సంధ్భంగా ఆయన మాట్లాడుతూ ఏసు ప్రభువు చూపిన బాటలో అందరూ శాంతియుత జీవనం సాగించాలని తెలిపారు. అనంతరం ఆయన క్రైస్తవ అక్క, చెల్లెమ్మలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేసి అందరికీ క్రిస్మస శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు జాన్ పాల్, సెల్వం, ఆర్ముగం, ఇంకా చిరంజీవి, సొరకాయలు, మేరీ తదితరులు పాల్గొన్నారు.

## వేప చెట్టు నుండి కారుతున్న పాలు!



నారాయణవనం, డిసెంబర్ 25 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీ చిత్రాంగికోటలోని ఓ వేప చెట్టు నుంచి ఆదివారం పాలు కారడంతో స్థానిక ప్రజలు తండోప తండోలుగా తరలి వచ్చి వీక్షించారు. అనంతరం ఆ పాల రుచి కూడా చేశారు. పాలు ఎంతో రుచిగా వుండడంతో మహిళలు భక్తితో పూజలు చేశారు. వేప చెట్టు నుంచి పాలు కారడం పట్ల పలువురు పలు విధాలుగా చర్చించుకున్నారు.

## వైకుంఠద్వార దర్శనం సంతోషం



తిరుమల,డిసెంబర్ 25ప్రభాతవార్తప్రతినిధి: పదిరోజుల వైకుంఠద్వార దర్శనంలో భాగంగా మూడవరోజు సోమవారం ఉదయం పలువురు న్యాయమూర్తులు స్వామివారిని దర్శించుకున్నారు. టిటిడి అధికారులు, వసతికల్పన విభాగం ఓఎస్‌డి రామకృష్ణ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మానవాళికి నిత్యరక్షణభాగ్యం

**-షెకీనా చర్చి ప్రార్థనల్లో ఫాస్టర్ అరుల్‌అరుసు**



తిరుపతి,డిసెంబర్ 25ప్రభాతవార్త: చీకటిలో జీవించే ప్రజలను రక్షించడానికి ఏసుక్రీస్తు జన్మించడం శుభపరిణామమని, ఆయన ద్వారా మానవాళికి నిత్యరక్షణభాగ్యం కలిగిందని కెబిలేఔట్ షెకీనా చర్చి ఫాస్టర్ అరుల్‌అరుసు తెలిపారు. సోమవారం క్రిస్మస్ పర్వదినాన షెకీనా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పెద్దసంఖ్యలో క్రైస్తవులు, క్రైస్తవేతరులు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్‌కట్‌చేసి పంచిపెట్టారు. బాలశాంతాక్లాజ్‌ను ఫాస్టర్ అరుల్ ఆశీర్వదించారు.

## పరిపాలన దక్షుడు వాజ్‌పాయి



తిరుపతి,డిసెంబర్ 25 ప్రభాతవార్త: భారతజాతి అభ్యున్నతికి అహర్నిశలు కృషిచేసిన మాజీ ప్రధాని అటల్ బిహార్ వాజ్‌పాయ్ అని,ఆయన సేవలు భారత్ మరచిపోలేదని బిజెపి నాయకులు కొనియాడారు. ప్రధానమంత్రిగా ఆయన తీసుకున్న నిర్ణయాలు భారత్ ఖ్యాతిని ఇనుమడింపజేసిందన్నారు. వాజ్‌పాయి 99వ జయంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, చంద్రప్ప, భానుప్రకాష్‌రెడ్డి, సామంచిశ్రీనివాస్, వరప్రసాద్, భాస్కర్, పెనుబాల చంద్రశేఖర్, సుబ్రమణ్యంయాదవ్ తదితరులు పేదలకు అన్నదానం చేశారు.

## తిరుచ్చి వాహనంపై రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు



చంద్రగిరి, డిశంబర్ 25 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం రోహిణీ నక్షత్రాన్ని పురస్కరించుకుని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారికి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపీనాద్, సూపరింటెండెంట్ నార్రా మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు ఆంజనేయాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆడుదాం ఆంధ్రా ఏర్పాట్లు సిద్ధం చేయండి : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 25 ప్రభాతవార్త : ఈ నెల 26 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఏర్పాట్లు సిద్ధం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాల ఏర్పాట్లపై నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో అన్ని విభాగాల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలో 26వ తేది నుండి ప్రారంభం అవుతాయని అన్నారు. ఈ క్రీడోత్సవాల ఏర్పాట్లపై నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో అన్ని విభాగాల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలో 25వ తేది నుండి ప్రారంభం అవుతాయని అన్నారు. ఈ క్రీడోత్సవాల ఏర్పాట్లు పండుగను తలపించేలా చేయాలని అన్నారు. అన్ని శాఖ ల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని అన్నారు. నగరంలోని 102 సచివాలయాల పరిధిలో 29 క్రీడా మైదానాల్లో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో వంటి క్రీడలు నిర్వహిస్తారని అన్నారు. ఇప్పటికే సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి టీంలు కూడా ఏర్పాటు చేశామని అన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో మ్యాప్ అయిన క్రీడా మైదానాల్లో అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే జిల్లా స్థాయి నుంచి సచివాలయాలకు క్రడీ సామాగ్రి చేరిందన్నారు. ప్రతి క్రీడా మైదానం వద్ద అంపైర్లు ఏర్పాటు, పర్యవేక్షణ అధికారులను సైతం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని అన్నారు. అందరూ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు కిందిస్థాయి అధికారులకు మార్గనిర్దేశనం చేసి పోటీలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని అన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో చేయాల్సిన ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలన్నారు. అనంతరం ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలకు క్రీడా మైదానాల్లో జరుగుతున్న ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపాల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్, ఆర్ఓ సేతు మాధవ్, సూపరింటెండెంట్ రవి, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ మేనేజర్ సయ్యద్, డిఈలు, పిఈటిలు, తదితరులు పాల్గొన్నారు.